టెన్త్ పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ విధింపు : సిపి రష్మీ

సిద్ధిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
టెన్త్ వార్షిక పరీక్షల నేపథ్యంలో పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతల పరిరక్షణకు, పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి 163 బిఎన్ఎస్ఎస్ 2003 సెక్షన్ అమలుచేస్తున్నట్లు సీపీ రష్మీపెరూమాళ్ గురువారం తెలిపారు. జిల్లాలోని 82 పరీక్షా కేంద్రాల చుట్టూ 500 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటాన్ని నిషేధించినట్లు తెలిపారు. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయన్నారు. పరీక్ష జరిగే ప్రతి రోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు అమలులో ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాల పరిసరాల్లో కర్రలు, రాళ్లు, ఆయుధాలు లేదా ఇతర ప్రమాదకరమైన వస్తువులు కలిగి ఉండడం నేరమన్నారు. పరీక్షలు జరిగే సమయంలో పరీక్షా కేంద్రాల సమీపంలో అన్ని జిరాక్స్ సెంటర్లను తప్పనిసరిగా మూసివేయాలని ఆదేశించారు. విద్యార్థులు ఎటువంటి ఆందోళన చెందకుండా పరీక్షలు రాసేలా అన్ని పోలీసు స్టేషన్ల అధికారులు తగిన బందోబస్తు రక్షణ ఏర్పాట్లు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఉత్తర్వులను ఉల్లఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

పదవ తరగతి పరీక్షలకు హుస్నాబాద్‌లో నాలుగు కేంద్రాలు

- హాజరు కానున్న 889 మంది విద్యార్థులు : మండల విద్యాశాఖ అధికారి మనీల

హుస్నాబాద్ రూరల్ మార్చి 12, ప్రభాతవార్త : మండలంలో నిర్వహించనున్న పదవ తరగతి వార్షిక పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మండల విద్యాశాఖ అధికారి బండారు మనిల తెలిపారు. మార్చి-ఏప్రిల్ 2026లో జరిగే ఈ పరీక్షలకు మండలంలో 4 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మండలంలో 889 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని, వీరిలో 430 మంది బాలురు, 459 మంది బాలికలు ఉన్నారన్నారు. పరీక్షల నిర్వహణకు 41 మంది ఇన్విజిలేటర్లు (క్లర్కులతో సహా) విధులు నిర్వర్తించనున్నట్లు వివరించారు. హుస్నాబాద్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్, జడ్పీహెచ్ఎస్ బాయ్స్, గర్ల్స్ హుస్నాబాద్, సాంఘీక సంక్షేమ గురుకుల బాయ్స్ హుస్నాబాద్ పాఠశాలల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్షలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు సమయానికి చేరుకుని నియమాలను పాటిస్తూ ప్రశాంతంగా పరీక్షలు రాయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులను పరీక్షల కోసం ప్రోత్సహించాలని కోరారు.

మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహా

అభివృద్ధిపై ప్రజాప్రతినిధులు దృష్టిని సారించాలి

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా

కంది, మార్చి 13, ప్రభాతవార్త: ప్రజలు నమ్మకంతో తమను ప్రజాప్రతినిధులుగా ఎన్నుకున్నారని, ప్రజల నమ్మకం వమ్ముకాకుండా గ్రామాలను, పట్టణాలను అభివృద్ధిపథకంలో పరుగులు తీసేలా పాలన అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా సూచించారు. మండల కేంద్రమైన కందిలోని ఎల్ఎన్ కన్వెన్షన్ హాల్‌లో గురువారం ప్రజాప్రతినిధులకు (మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, సర్పంచ్‌లకు) పంచాయితీరాజ్, మున్సిపల్ చట్టాలపై అవగాహన, ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి దామోదర్ రాజనర్సింహా మాట్లాడుతూ ప్రజాపాలన-ప్రగణి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌ను 5 దశలు, 10 అంశాలుగా రూపొందించిందన్నారు. మార్చి 6 నుంచి జూన్ 12 వరకు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 2 నుంచి గ్రామాల్లో గ్రామ సభలు, పట్టణాల్లో వార్డుసభలు నిర్వహించనున్నట్లు వివరించారు. ప్రజా ప్రతి నిధులు గ్రామ సభల్లోని అభివృద్ధికి బాటలువేసుకోవాలని సూచించారు.

ముస్లింలకు బడ్జెట్‌లో రూ. 4 వేల కోట్లు కేటాయించాలి

మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు

ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీష్‌రావు

జహీరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త: వచ్చే అసెంబ్లీ బడ్జెట్‌లో మైనార్టీల అభివృద్ధికి 4వేల కోట్ల రూపాయలను కేటాయించాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు కోరారు. గురువారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని గౌరీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు హరీష్‌రావు ముఖ్య అతిథిగా హాజరై మైనార్టీకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ ఇఫ్తార్ విందును ఆరగించారు. ఈ సందర్భంగా హరీష్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల సందర్భంగా చేసిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. షాదీ ముబారక్‌కు 1,60,000 బడ్జెట్లో కేటాయించాలన్నారు. జహీరాబాద్‌లో అసంపూర్తిగా ఉన్న హాజ్‌హౌజ్‌ను పూర్తిచేయాలని సూచించారు. కేసిఆర్ హయాంలో మైనార్టీలకు రంజాన్ తోఫాలు, 200 రెసిడెన్షియల్ పాఠశాలలు ఏర్పాటు చేశారని గుర్తు చేశారు.

యుద్ధంతో ప్రజలు ఆందోళన...

పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధంతో దేశంలోని ప్రజలతో పాటు ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. యుద్ధంతో ధరలు పెరిగి ప్రజలకు నిత్యావసర వస్తువులు, పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్‌లు అందక ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. యుద్ధాన్ని తొందరగా ముగిసే విధంగా ప్రజలందరూ అల్లాను ప్రార్థించాలని వినతి చేశారు. నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లను మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావుఉ, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావులు శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సమావేశంలో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ వై నరోత్తం, మాజీ డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, బిఆర్ఎస్ నాయకులు నామరవికిరణ్, తట్టు నారాయణ, ఎండి తంజీం, గౌస్‌గోరీ, నాదల్‌గోరి, మాజీ మున్సిపల్ చైర్మన్ అల్లాడి నర్సింలు, మాజీ వైస్ చైర్మన్ అశోక్ సేరి, బిఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

అటవీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు శిక్షణ

ములుగు, మార్చి 12 (ప్రభాతవార్త): మండల కేంద్రంలోని అటవీ కళాశాల, పరిశోధన సంస్థ(ఎఫ్‌సిఆర్ఐ)లో గురువారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎంఎస్ శ్రీనిధి ఆధ్వర్యంలో జరిగిన ఈ ఓరియంటేషన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా శ్రీకొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ జే. చీనా హాజరై వలంటీర్లను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవాలని, తమ విద్యాభ్యాసంతో పాటు సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలన్నారు. సమాజ అభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల పాత్ర గణనీయమైనది అని అన్నారు. ప్రధాన వక్తగా హాజరైన అనురాగ్ యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ మరియు ఎన్‌సిసి హెడ్ డాక్టర్ మల్లేషా మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ లక్ష్యాలు, ఉద్దేశాల గురించి వివరించారు. విద్యార్థి వ్యక్తిగత అభివృద్ధిలో ఎన్ఎస్ఎస్ పాత్ర కీలకమైందని, ఎన్ఎస్ఎస్ వల్ల విద్యార్థుల్లో సమాజం పట్ల బాధ్యత పెరుగుతుందన్నారు. విద్యార్థులు బాధ్యత గల పౌరులుగా తీర్చిదిద్దబడతారని తెలిపారు. టీంవర్క్ చేయడం అలవాటు అవుతుందన్నారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ప్రస్తుత సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకొని సుస్థిరమైన పరిష్కారాలను కనిపెట్టాలని అన్నారు.

శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్

సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎమ్మెల్యే ప్రజాప్రతినిధులు, అధికారులు

మెదక్, మార్చి 12, ప్రభాతవార్త : ప్రజాప్రతినిధులు అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. గురువారం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ప్రజాపాలనా ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలోభాగంగా మున్సిపల్ చైర్మన్లకు, కౌన్సిలర్లకు, సర్పంచులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతిమాసింగ్, మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక నోడల్ అధికారి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి, రాష్ట్ర గీతం జయ జయ హే..తో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ.. పట్టణ,గ్రామస్థాయిలో ప్రజా ప్రతినిధులు అధికారుల సమన్వయంతో ప్రభుత్వ సంక్షేమపథకాలు లబ్ధిదారులకు చేరాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఒక బృహత్తర కార్యక్రమం ఇది అని అన్నారు. సర్పంచులు గ్రామం నాది అనే స్వభావాన్ని కలిగి ఉండాలని చెప్పారు. 99 రోజుల్లో అనేక కార్యక్రమాల చేపడుతునట్లు చెప్పారు. సుబిక్షమైన పట్టణ ,పల్లెల కోసం నిరంతరం కృషి చేయాలన్నారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు మాట్లాడుతూ..ఇందిరమ్మ రాజ్యంలో ప్రజల అభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం నిరతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, జీరో విద్యుత్,సన్నబియ్యం,మెడికల్ కాలేజీ,యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మాణంలాంటి అనేక పథకాలు చేపట్టామన్నారు.అధికారులు ప్రజా ప్రతినిధులు ప్రజల సమస్యలను తీర్చి, పథకాలు ముందుకు తీసుకెళ్లాలన్నారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ, శాంతి భద్రతను కాపాడాలని, రోడ్డు ప్రమాదాలవల్ల రోజురోజుకు మరణాల సంఖ్య పెరుగుతుందని, ట్రాఫిక్ నిబంధనలు పాటించి, డ్రగ్స్, సైబర్ క్రైమ్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నోడల్‌అధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ, పట్టణ, గ్రామీణ ప్రజాప్రతినిధుల పదవి చిన్నదైన బాధ్యత పెద్దదన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజా అవసరాలను తీర్చాలన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ, పట్టణ, గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి పథంలో నడవాలంటే ప్రజా ప్రతినిధులు అధికారులు ప్రజల సమస్యలను గుర్తించి, పరిష్కారం చూపించాలన్నారు. అంతకుముందు సమాచార పౌర సంబంధాల శాఖ మెదక్ జిల్లా వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాల ఫోటోల ఎగ్జిబిషన్ ను అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా అధికారులతో కలసి జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ తిలకించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

కలెక్టర్‌తో సమావేశమైన ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మణిక్‌రావు

సమస్యలపై కలెక్టర్‌తో ఎమ్మెల్యేలు సమావేశం

సంగారెడ్డి మున్సిపాలిటీ మార్చి 12, ప్రభాతవార్త : సంగారెడ్డి నియోజక వర్గంలో పెండింగ్‌లోఉన్న అభివృద్ధి పనులు, సమస్యలను ఎమ్మెల్యేలు చింత ప్రభాకర్, మాణిక్‌రావు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావిణ్య దృష్టికి తీసుకెళ్లారు తీసుకెళ్లారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ ప్రావీణ్యతో ఎమ్మెల్యేలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను, పెండింగ్ పనులను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యేలు ప్రస్తావించిన సమస్యలపై కలెక్టర్ ప్రావీణ్య సానుకూలంగా స్పందించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, సాయిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హత్నూర మండలానికి కోటి 25 లక్షల నిధులు మంజూరు

హత్నూర మార్చి 12, ప్రభాతవార్త : నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలోని హత్నూర మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ఎంజిఎన్ఆర్ఇజిఎస్ పథకం ద్వారా రూ.1 కోటి 25 లక్షలు మంజూర య్యాయని నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిధులతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించనున్నామని ఆయన పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగేందుకు తాము నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. నిధ్ర మంజూరుకు కృషి చేసిన ఆవుల రాజు రెడ్డి కి స్థానిక ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు కృతజ్ఞతలు తెలిపారు.

మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి విజయ

కష్టంతో కాదు.. ఇష్టంతో చదవండి

జిల్లా విద్యాశాఖాధికారి విజయ

పాపన్నపేట, మార్చి 12, ప్రభాతవార్త : పరీక్షల మధ్య ఉన్న వ్యవధిని వినియోగించుకొని, మంచి ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాశాఖాధికారి విజయ సూచించారు. గురువారం పాపన్నపేట మండలం నాగ్సాన్పల్లి పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ పరీక్షలు మార్చి 14 ప్రారంభమై ఏప్రిల్ 16వ తేదీవరకు సాగుతాయన్నారు. 34 రోజుల పాటు సాగే పరీక్షల్లో, ఒక్కో పరీక్షకు మధ్య చాలా విరామం దొరుకుతుందని తెలిపారు. ఈ సమయాన్ని వృధా చేయకుండా, చక్కగా చదువుకుంటూ, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కష్టంతోకాకుండా, ఇష్టంతో చదివినవుడే మంచి ఫలితాలు వస్తాయని తెలి పారు. పక్కా ప్రణాళికతో చదివితే లక్ష్యం సాధించవచ్చని చెప్పారు. పరీక్షల సమయంలో విద్యార్థులను పెళ్లిళ్లకు, పేరంటాలకు తిప్పొద్దని తల్లిదండ్రులకు సూచించారు.

దాత సంగమేశ్వర్కు సన్మానం

పాఠశాల అభివృద్ధి కోసం రూ. లక్ష విరాళమిచ్చిన గ్రామస్థుడు వట్టం సంగమేశ్వర్‌ను డీఇఓ విజయ ఘనంగా సన్మానించారు. మన ఊరు, మన బడి కి ఎంత చేసినా తక్కువేనని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలకు సహాయం చేస్తే పేద విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేసిన వారు అవుతారని కొనియాడారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ చంద్రమ్మ, సర్పంచ్ దండెం సుశీల, హెచ్ఎం నజీరొద్దిన్, ఏఎంఓ సుదర్శనమూర్తి, ఏఎస్ఓ నవీన్, సిఎంఓ రాజు, రిటైర్డ్ హెచ్ఎంలు మహిపాల్‌రెడ్డి, రాంకిషన్, సాయిక్రిష్ణ, టీచర్లు శ్రీనివాస్, అశోక్‌కుమార్, నర్సింలు, సిద్దేశ్వర్, రేఖ, ముజీబ్, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి : ఎస్ఐ

అల్లాదుర్గం, మార్చి 12, ప్రభాతవార్త: యువత డ్రగ్స్ దూరంగా ఉండాలని ఎస్ఐ శంకర్ సూచించారు. గురువారం మండల పరిధిలోని సీతానగర్‌లో 99 రోజుల ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా డ్రగ్స్ మహమ్మారిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శంకర్ మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగంతో ఆరోగ్యం చెడిపోవడంతో పాటు కుటుంబం రోడ్డుపాలవుతుందన్నారు. డ్రగ్స్ మహమ్మారిని పారద్రోలేందుకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అనిత, నాయకులు పవన్, బేతయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు హాల్ టికెట్స్ పంపిణీ చేసిన పాఠశాల హెచ్ఎం సాంబయ్య

పదవ తరగతి విద్యార్థులకు హాల్ టికెట్స్ పంపిణీ

వెల్దుర్తి, మార్చి 12, ప్రభాతవార్త : మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు గురువారం ప్రధానోపాధ్యాయులు సాంబయ్య హాల్ టికెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు సకాలంలో పరీక్షల కేంద్రానికి చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి. నరసింహారెడ్డి. అమూల్య. జయసుధ. నవనీత. సునీత. పద్మజ. శైలజ. విజయ్. రాము. వెంకట్ రెడ్డి. ఖాదర్ బాషా పాల్గొన్నారు.

బైక్‌పై వెళ్తున్న వ్యక్తిపై కోతులు దాడి, గాయాలు

హుస్నాబాద్ రూరల్, మార్చి 12, ప్రభాతవార్త :
గురువారం హుస్నాబాద్‌లోని రిలయన్స్ టవర్ ప్రాంగణం వద్ద కోతులు బైక్‌పై వెళ్తున్న వ్యక్తిపై దాడిచేయడంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం... ఆ ప్రాంతంలో ఇటీవలి కోతుల సంచారం విపరీతంగా పెరిగిందని, రోడ్లపై వెళ్లే ప్రజలపై, ఇళ్ల దగ్గర ఉన్నవారిపై తరచూ దాడి చేస్తున్నాయన్నారు. బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని కోతులు ఒక్కసారిగా దాడి చేయడంతో అతడికి గాయాలు కావడంతో స్థానికులు వెంటనే సహాయం చేశారు. కోతుల భయంతో ఆ ప్రాంతంలో ప్రజలు బయటకు రావడానికి భయపడుతున్న పరిస్థితి నెలకొంది. ఈనేపథ్యంలో వెంటనే అటవీ శాఖ లేదా మున్సిపల్ అధికారులు స్పందించి కోతుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన కోతుల బెడదపై అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జరిమాన విధిస్తున్న మున్సిపల్ కమిషనర్

భోజనంలో బొద్దింక

హయత్ రెస్టారెంట్‌కు రూ.15 వేల జరిమాన

సిద్దిపేట అర్బన్, మార్చి 12, ప్రభాతవార్త : జిల్లా కేంద్రంలోని మెదక్ రోడ్డులోగల హయత్ రెస్టారెంట్‌లో భోజనం చేస్తుండగా బొద్దింక కనిపించిందని గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే స్పందించిన కమిషనర్ సిద్ది అశ్రిత్‌కుమార్ హయత్ రెస్టారెంట్‌కు వెళ్లి తనిఖీ చేయాలని ఆదేశించారు. మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు శానిటరీ సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఎస్ఐలు శివకుమార్, సత్యనారాయణ, ఈఈ అన్వేష్ హయత్ హోటల్ కిచెన్‌ను తనిఖీ చేసి రూ. 15 వేల జరిమానా విధించారు. మరోసారి ఇలాంటి సంఘటన జరగకుండా చూసుకోవాలని హోటల్ యజమానికి సూచించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

జహీరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త: మద్యానికి బానిసై భార్యను హత్యచేసిన భర్తకు జీవిత ఖైదు విధిస్తూ జిల్లా సెషన్ జడ్జి భవాని చంద్ర తీర్పు చెప్పినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... ఝరాసంగం మండలం ఏడాకులపల్లి గ్రామానికి చెందిన బిచి రాములుకు 2012లో జహీరాబాద్‌కు చెందిన లక్ష్మీతో వివాహం జరిగింది. లక్ష్మీ, రాములు దంపతులకు సంతానం లేదు. దీంతో రాములు మద్యానికి బానిసై తరుచూ భార్యతో గొడవపడేవాడన్నారు. భర్త వేధింపులు భరించలేక లక్ష్మీ పుట్టింటికి వెళ్లిపోయింది. కాగా 16 డిసెంబర్ 2021న సాయంత్రం మాట్లాడాలని చెప్పి భార్యను తీసుకెళ్లి గొడవపడి శ్మశానవాటిక వద్ద భార్య చున్నీని మెడకు బిగించి హత్య చేశాడన్నారు. కేసును విచారించిన న్యాయమూర్తి నిందితుడికి జీవిత ఖైదుతోపాటు వేయి రూపాయల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించారన్నారు. వేయి రూపాయల జరిమాన చెల్లించుకుంటే ఒక నెల సాధారణ కారాగార శిక్షను విధించారు. నిందితుడికి శిక్షపడేలా సహకరించిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి.శైలజ, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.రాజశేఖర్, ఎస్ఐ కె.శ్రీకాంత్, చార్జ్‌షీట్ దాఖలు చేసిన టి.భూపతి, టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్ఓ కె.వినయ్‌కుమార్, కోర్టు సిబ్బంది సిడిఓ శివకుమార్, రాజశేఖర్, లైజనింగ్ అధికారి కె.సత్యనారాయణలను జిల్లా ఎస్‌పి ప్రత్యేకంగా అభినందించారు.

చెట్టుపై నుంచి పడి యువకుడి మృతి

అల్లాదుర్గం, మార్చి 12, ప్రభాతవార్త: చింతకాయలు తెంపుతూ ప్రమాదావశాస్తు చెట్టుపై నుంచి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన అల్లాదుర్గంలో గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ శంకర్ కథనం ప్రకారం... కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని ఇస్లాంపూర్ గ్రామానికి చెందిన దాసరి రాజనాల హరికృష్ణ(27) కూలీ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడన్నారు. అల్లాదుర్గం గ్రామానికి చెందిన అనిల్‌రెడ్డి మామిడి తోటలో పనిచేసేందుకు భార్య శ్రావణితో వచ్చి పనులు చేసుకుంటున్నాడన్నారు. చింతచెట్టు ఎక్కి చింతకాయలు కోస్తూ ఉండగా ప్రమాదావశాస్తు చెట్టు నుంచి కిందపడి తీవ్ర గాయాలకుగురికాగా చికిత్స నిమిత్తం పెద్దశంకరంపేటలోని సంగమేశ్వర ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడని చెప్పారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శంకర్ వివరించారు.

పోలీసులను బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

చిన్నశంకరంపేట, మార్చి 12, ప్రభాతవార్త: విధులు నిర్వహిస్తున్న పోలీసులను పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నారాయణగౌడ్ గురువారం తెలిపారు. రుద్రారం గ్రామానికి చెందిన దంపతులు గైనికాడి సుశీల, అశోక్ అదే గ్రామానికి చెందిన శ్రీనుపై ఇరువురు కలిసి దాడి చేశారు. గాయపడిన శ్రీను ఠాణాలో విధులు నిర్వహిస్తున్న ఏఎస్ఐ విఠల్‌కు ఫిర్యాదుచేయగా, ఇంజూర్డ్ ఫామ్‌ను అందించి ఏరియా ఆసుపత్రికి వెళ్లాలని సూచించారు. శ్రీను ఇచ్చిన ఫిర్యాదును తీసుకొని తనపై కేసు నమోదు చేస్తే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడతానని అశోక్ ఏఎస్ఐని బెదిరించాడు. దీంతో ఏఎస్ఐ విఠల్ ఫిర్యాదు మేరకు గైనికాడి అశోక్‌పై విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగుడిని బెదిరించిన నేరం కింద భారత న్యాయ సంహితలోని సెక్షన్ 226 కింద కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:
ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజాప్రతినిధులకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తుందని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్డి సంక్షేమ సంఘం భవనంలో గురువారం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై మున్సిపల్ చైర్మన్లు, వార్డు కౌన్సిలర్లు, సర్పంచ్‌లకు సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్, అదనపు కలెక్టర్ వివిధశాఖల అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి సిఎం వీడియో సందేశాన్ని ప్రాజెక్టర్ ద్వారా ప్రదర్శించారు. ఈ సందర్భంగా బక్కి వెంకటయ్య మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా, సమాజమే దేవాలయంగా భావించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేయాలన్నారు.

గ్రామాభివృద్ధికి కట్టుబడి పనిచేయాలి

ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధికి కట్టుబడి పనిచేయాలని దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి సూచించారు. గ్రామ సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రోడ్ల పక్కన ఉన్న పిచ్చి మొక్కలు, చెరువుల కట్టలను శుభ్రం చేయించుకోవాలన్నారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించి స్టీల్‌బ్యాంక్ ఏర్పాటుచేసి స్టీల్ పాత్రలను వినియోగించేలా చూడాలన్నారు.

గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకం

జిల్లా కలెక్టర్ హైమావతి

గ్రామాభివృద్ధిలో ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 99 రోజుల ప్రజాపాలన కార్యక్రమాన్ని 5 అంచెల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన లబ్దిదారులకు చేరేలా ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. గ్రామాల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. సోలార్ విద్యుత్ వినియోగానికి ప్రభుత్వం సబ్సిడి అందిస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, జిల్లా అధికారులు డాక్టర్ ధనరాజ్, దశరథ్, పద్మజారాణి, రవీందర్, జయదేవ్ ఆర్యా పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మతసామరస్యానికి ప్రతీకగా రంజాన్ : ఎమ్మెల్యే తలసాని

మోండా మార్కెట్‌లోని ఇస్లామియా మజీద్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తదితరులు

అడ్డగుట్ట,మార్చి 12 ప్రభాతవార్త: ముస్లింలు ఎంతో పవిత్రంగా జరుపుకునే రంజాన్ మతసామరస్యానికి ప్రతీక అని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం రాత్రి మోండా డివిజన్‌లోని ఇస్లామియా మజీద్‌లో నిర్వహించిన ఇఫ్తార్ విందు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అనంతరం ఉపవాస రోజా చేపట్టిన ముస్లిం సోదరులకు పండ్లు తినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ఈ నెల రోజుల పాటు ఎంతో భక్తి శ్రద్ధలతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాస దీక్షలు చేపడుతారన్నారు. కేసిఆర్ ప్రభుత్వంలో రంజాన్‌కు ప్రభుత్వం ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేయడంతో పాటు రంజాన్ కిట్లను అందజేసిందని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు ఆకుల హరిక్రిష్ణ, తలసాని స్కైలాబ్ యాదవ్, శివ యాదవ్, నాగులు, మహేష్ యాదవ్,మహేందర్, మజీద్ ఇస్లామియా కమిటీ అధ్యక్షులు అమీద్, ప్రతినిధులు సాబేర్ జానీ, అజ్మత్,జబ్బార్, నయీం పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు అండగా ఎమ్మెల్యే వివేకానంద గౌడ్

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న నాయకులు

నిజాంపేట్, మార్చి 12, ప్రభాతవార్త

ప్రగతి నగర్ కమాన్ వద్ద ఇటీవల షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో నష్టపోయిన ఫర్నిచర్ షాప్ దుకాణదారుల సమస్యలను కేపీ వివేకానంద గౌడ్‌కి బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు వివరించారు. గురువారం బిఆర్‌ఎస్ పార్టీ ఎన్ఎంసి ఆర్గనైజింగ్ సెక్రటరీ సాంబశివారెడ్డి ఎమ్మెల్యేను కలిసి బాధిత దుకాణదారుల ఆర్థిక పరిస్థితులను వివరించారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే వివేకానంద గౌడ్, బాధితులకు తగిన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జలగం చంద్రయ్య, నిరుడు యాదగిరి, అంజన్ కుమార్ యాదవ్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

15న హనుమకొండలో 'హమాలీ మహాగర్జన సభ'

వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు ఖలీల్ అహ్మద్, శ్రీనివాస్, శివకుమార్ తదితరులు

సైఫాబాద్, మార్చి 12 ప్రభాతవార్త: తెలంగాణ హమాలీ వర్కర్స్ యూనియన్ దశాబ్ధి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన హనుమకొండలో డిమాండ్ల సాధన కోసం 'హమాలీ మహాగర్జన సభ' నిర్వహిస్తున్నామని యూనియన్ ప్రకటించింది. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఈ మహాగర్జనకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను యూనియన్ గౌరవ అధ్యక్షుడు ఖలీల్ అహ్మద్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎస్.వి.శివకుమార్ తదితరులు ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పది నుంచి 20 లక్షల మంది హమాలీలు వివిధ జిల్లాల్లో పనిచేస్తున్నారని, ఇందులో పది లక్షల మంది తమ యూనియన్‌లో సభ్యులుగా కొనసాగుతున్నారని చెప్పారు. మహారాష్ట్రలో తరహా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే హమాలీ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలు, వేతనంతో కూడిన సెలవులు, పిఎఫ్, ఇఎస్ఐ తదితర డిమాండ్లను అమలు చేయాలని కోరారు. పై డిమాండ్లపై హమాలీ మహాగర్జన సభలో రాష్ట్ర మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధుల ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆపైన జరిగే పరిణామాలకు రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా బాధ్యత వహించవలసి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో హరిబాబు, ఉగ్రం యాదవ్, రాములు, రాజు పాల్గొన్నారు.

ఇండ్లు కోల్పోయిన వారికి స్థలాలు కేటాయించడం హర్షణీయం

-ఖైరతాబాద్ మాజీ కార్పొరేటర్ విజయారెడ్డి

ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న విజయారెడ్డి తదితరులు

హైదరాబాద్, మార్చి 12,ప్రభాతవార్త:

నిమ్స్ అభివృద్ధిలో భాగంగా ఎర్రమంజిల్‌లో ఇండ్లు కోల్పోయిన తొమ్మిది మందికి కాంగ్రెస్ ప్రభుత్వం ఇండ్ల స్థలాలు కేటాయించడంపై ఖైరతాబాద్ మాజీ కార్పొరేటర్ కాంగ్రెస్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే విజయారెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ ప్రభుత్వం పేదలు అందరికీ అండగా నిలబడుతుందని అన్నారు. ఈమేరకు గురువారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాడు ఇండ్లు కోల్పోయిన తొమ్మిది మంది మహిళలతో కలిసి మాట్లాడారు. ఈసందర్భంగా విజయారెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో నిమ్స్ ఆసుపత్రిని అభివృద్ధి చేస్తామని పేర్కొంటూ ఎర్రమంజిల్ లోని కొంతమంది ఇండ్లను ఇష్టారాజ్యంగా కూల్చివేతలు చేశారని, అందులో తొమ్మిది మందికి ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఎర్రమంజిల్ లోనే ఇండ్ల స్థలాలను కేటాయిస్తూ జి.ఓ విడుదల చేయడం హర్షణీయం అన్నారు. అప్పటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంకుశంగా ఇంట్లో పేషెంట్ ఉన్నా కూడా చూడకుండా కూల్చివేతలు చేశారని, అప్పటి నుండి తాము న్యాయస్థానంలో ఇదే విషయమై పోరాటం చేస్తున్నామన్నారు. పేదల పార్టీగా పేరున్న తమ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిల సహకారంతో ఈ తొమ్మిది మంది మహిళలకు ఇదే ఎర్రమంజిల్‌లో ఇండ్ల స్థలాలను కేటాయిస్తూ జి.ఓ ను తేవడం సంతోషకరం అని అన్నారు. ఈకార్యక్రమంలో తస్లీమ్ బేగం, విజయలక్ష్మి లతో పాటు మహిళలు కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలను అరికట్టేందుకు సిసి కెమేరాలు ఎంతో మేలు : ఎమ్మెల్యే శ్రీగణేష్

రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో సీసీటీవీ కెమరాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ తదితరులు

అడ్డగుట్ట,మార్చి 12 ప్రభాతవార్త: నేరాలు,ప్రమాదాలను, సంఘ విద్రోహ శక్తులను అరికట్టడంతో పాటు వారిని వెంటనే గుర్తించేందుకు సీసీటీవి కెమరాలు ఎంతగానో ఉపయోగపడుతాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ తెలిపారు. మోండా డివిజన్‌కు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత చిర్రబోయిన సంతోష్ యాదవ్ తన సొంత నిధులతో రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో రూ.2 లక్షల విలువ చేసే సీసీటీవి కెమరాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీగణేష్ మాట్లాడుతూ ఒక సీసీకెమరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. దొంగతనాలు, ప్రమాదాలు,దాడులు వంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు సీసీకెమరాల ద్వారా నిందితులను గుర్తించడంలో పోలీసులకు ఎంతో సులువు ఉంటుందన్నారు. ఇటువంటి కార్యక్రమాలకు సంతోష్ యాదవ్ వంటి దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అదే విధంగా మోండా డివిజన్ వివిధ ప్రాంతాల్లో సీసీకెమరాలు ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచినందుకు అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు చిర్రబోయిన వైష్ణవి యాదవ్,మోండా డివిజన్ అధ్యక్షులు ఆర్.డి.నాగేశ్ యాదవ్, బస్తీ నాయకులు డి.బాబురావ్,రౌతు రాజయ్య, సాంబయ్య,యూత్ అధ్యక్షుడు పి.నర్సింగ్ రావ్, ఆశీర్వాదం ,శివ, రేపాల వెంకటేశ్వర్లు,అరుణ్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి గౌరవించాలి : శివబాలాజీ, అంజనీరాజన్

పురస్కారాలందుకున్న ప్రతిభావంతులైన విద్యార్థులతో శివబాలాజీ, రామకృష్ణ, అంజలి, జగజీవన్‌రెడ్డి తదితర అతిథులు

నాంపల్లి, మార్చి 12 ప్రభాతవార్త : విద్యార్థుల్లో నిగూఢంగా దాగివున్న ప్రతిభను వెలికితీసి, గుర్తించి గౌరవిస్తేనే ప్రగతి సాధ్యమవుతుందని ప్రముఖ నటుడు, శివబాలాజీ, మెరిడియన్ సెంటర్ ఫర్ ఎక్సలెన్సీ డీన్ అంజలిరాజన్, మాస్టర్‌గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ఫెడరేషన్ ఇండియా వైస్‌చైర్మన్ డా. కొలను జగజీవన్‌రెడ్డి అన్నారు. కింగ్‌కోటి, బషీర్‌బాగ్‌లోని భారతీయ విద్యాభవన్ ఆడిటోరియంలో ఘనంగా జరిగిన ఇండియన్ బ్రిలియంట్ ఒలింపియాడ్ (ఐబిఒ) జాతీయస్థాయి అవార్డుల ప్రదానోత్సవానికి ముఖ్యఅతిథులుగా హాజరైన శివబాలాజీ, అంజలి రాజన్, జగజీవన్‌రెడ్డిలు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి ఎంపికైన ప్రతిభావంతులైన విద్యార్థులను ఈ వేడుకల్లో ఘనంగా సన్మానించి పురస్కారాలు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఈయేడాది నిర్వహించిన మొదటిస్థాయి పరీక్షల్లో సుమారు 20వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని, అందులో అత్యంత ప్రతిభావంతులైన 2వేల మంది విద్యార్థులు జోనల్‌స్థాయి పరీక్షలకు అర్హత సాధించగా తుది పోటీలో జాతీయ రాష్ట్ర జిల్లా స్థాయిల్లో టాపర్లుగా నిలిచిన 250మంది విద్యార్థులను పురస్కారాలతో గౌరవించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ బ్రిలియంట్ ఒలంపియాడ్ 2026–27 విద్యాసంవత్సరం పరీక్షా క్యాలెండర్‌ను అతిథుల చేతులమీదుగా ఆవిష్కరింపజేశారు. ఈ వేడుకల్లో డా. పి.భువనేశ్వరి, డా.శ్రీపూజ సిద్ధమశెట్టి, సుహాసిని పాణ్యం, డా. కపిల్‌దేవ్, వి.పి. లతాప్రభాకర్, కావ్య, ప్రశాంతి, శంకర్, నయీమ్, ప్రసాద్ తదితరులు పాల్గొని ప్రసంగించారు. చివరిగా అతిథుల చేతులమీదుగా విజేతలకు మెడల్స్, ప్రశంసాపత్రాలు ప్రదానంచేసి శుభాశీస్సులు అందజేశారు.

మహిళ బిల్లులో బిసిమహిళలకు సబ్ కోటా కేటాయించాలి : జాజుల శ్రీనివాస్‌గౌడ్

మహిళా నాయకులను సన్మానిస్తున్నజాజుల శ్రీనివాస్‌గౌడ్, చంద్రశేఖర్‌గౌడ్, మణిమంజరి, డాక్టర్ రమ తదితరులు

హైదరాబాద్, మార్చి 12,ప్రభాతవార్త:

చట్టసభలలో అన్ని వర్గాల మహిళలకు జనాభా దామాషా ప్రకారం రాజకీయ వాటా కల్పించే వరకు పోరాడి సాధించాలని, అప్పుడే మహిళా సాధికారత లభిస్తుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం ఖైరతాబాద్ లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో మహిళా దినోత్సవాన్ని బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి మని మంజరి, బీసీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు సావిత్రిబాయి పూలే జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. చట్టసభలలో మహిళలకు 33 రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంటులో బిల్లును ఆమోదించిన కేంద్ర ప్రభుత్వం అన్ని వర్గాల మహిళలకు అందులో సబ్ కోట కల్పించకపోవడం చాలా అన్యాయం అన్నారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట లేకపోవడం మూలంగా మహిళా బిల్లు అమలు జరిగిన అగ్రకుల నాయకులు కుర్చీలలో వారి కుటుంబ సభ్యులు మాత్రమే మహిళా బిల్లు పేరుతో చట్టసభలోకి అడుగు పెడతారన్నారు. బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి. మని మంజరి, ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రమ లు మాట్లాడుతూ మహిళలు తమ హక్కుల కోసం పోరాడుతూనే మీకు ఒక వైపు పోటీ ప్రపంచం పురుషులతో సమానంగా ఎదగడానికి సమాజంలో ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకోవాలని, ప్రస్తుతం జరిగే పార్లమెంటు సమావేశాలలో మహిళా బిల్లుపై ప్రత్యేకంగా చర్చించి మహిళా బిల్లులో బీసీ మహిళకు సబ్ కోట కల్పించాలని ప్రధాని నరేంద్ర మోడీకి విజ్ఞప్తి చేశారు లేకుంటే పార్లమెంట్ ముట్టడి చేపడతామని వారు హెచ్చరించారు. ఈసందర్భంగా వివిధ రంగాల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన 40 మంది మహిళ నేతలకు జాజుల శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇన్నిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ చైర్మన్ డాక్టర్ రమణ నాయక్, బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం.చంద్రశేఖర్ గౌడ్, బీసీ మహిళ నేతలు రాధా రాణి, తారకేశ్వరి, జ్యోతి, సమతా యాదవ్, సంధ్యారాణి, సుజాత, ఉమాదేవి, మీనా, సరిత, విజయ లక్ష్మి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని జలమండలి అధికారులకు వినతి

కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని జల మండలి అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బిజెపి నేత నీరుడు శేఖర్ ముదిరాజ్.

నార్సింగి, మార్చి 12 ప్రభాతవార్త : రాజేంద్రనగర్ సర్కిల్ కిస్మత్‌పూర్ డివిజన్ పరిధిలోని దర్గా కలిస్కాన్ ప్రాంతంలో సరఫరా అవుతున్న కలుషిత నీటిని అరికట్టాలని, ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని సరఫరా చేయాలని కోరుతూ బిజెపి రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు నీరుడు శేఖర్ ముదిరాజ్ జల మండలి జీఎం జవహర్ అలీకి వినతిపత్రంను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా దర్గా కలిస్కాన్ ప్రాంతంలో మురుగునీరు మంచినీటి పైప్‌లైన్‌లో కలిసి నల్లాల ద్వారా ఇళ్లకు సరఫరా అవుతుందన్నారు. ఇళ్లల్లో నల్లాల ద్వారా మంచినీటిని పట్టుకుంటున్న సమయంలో దుర్వాసన వస్తుందని, ఈ నీటిని తాగడానికి కాదుకదా కనీసం వాడుకునేందుకు కూడా వీలులేకుండా ఉందన్నారు. ఈ అపరిశుభ్రమైన నీటిని తాగి ప్రజలు అనారోగ్యం పాలయితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. జల మండలికి సకాలంలో ప్రజలు నీటి బిల్లులు చెల్లిస్తున్నా, నాణ్యమైన మంచినీటిని సరఫరా చేయడంలో అధికారులు అలసత్వం వహించడం మంచిది కాదన్నారు. వెంటనే జల మండలి అధికారులు స్పందించి ఈ కలుషిత నీటి సరఫరాను అరికట్టాలని, శుద్దమైన నీటిని ప్రజలకు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరామన్నారు. అధికారులు స్పందించకపోతే బాధిత ప్రజలందరిని పోగు చేసుకొని జల మండలి కార్యాలయం ముందు న్యాయం చేయాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తామని నీరుడు శేఖర్ ముదిరాజ్ హెచ్చరించారు. వినతిపత్రం అందుకున్న జిఎం జవహర్‌అలీ వెంటనే స్పందిస్తూ వెంటనే మంచినీటి పైప్‌లైన్‌లకు మరమ్మత్తులు చేయించి, శుద్ధమైన నీటిని సరఫరా చేసేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారని శేఖర్ ముదిరాజ్ తెలిపారు.

మరణించిన ఉపాధ్యాయ కుటుంబానికి రూ.6 లక్షల చెక్కు అందజేత

కొండయ్య కుటుంబానికి చెక్కును అందజేస్తున్న దృశ్యం

నిజాంపేట్, మార్చి 12, ప్రభాతవార్త

ఒక్కరి కొరకు అందరం.. అందరి కొరకు ఒక్కరం అనే నినాదంతో నిర్వహిస్తున్న ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ కార్యక్రమం మరణించిన ఉపాధ్యాయుల కుటుంబాలకు అండగా నిలుస్తోందని తెలంగాణ స్టేట్ యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు తెలిపారు. గురువారం మేడ్చల్ జిల్లాలోని జవ హర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయు డిగా పనిచేస్తున్న కొండయ్య ఇటీవల జనవరిలో ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన టీఎస్ యుటిఎఫ్ నాయకుడిగా, ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ సభ్యుడిగా ఉండడంతో, టీఎస్ యు టిఎఫ్ మేడ్చల్ జిల్లా తరపున ఆయన కుటుంబానికి రూ.6 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమం ఆయన పనిచే సిన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జవహర్‌నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.డి. అజం అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చావా రవి ,రాష్ట్ర నాయకులు మాణిక్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం టీఎస్ యుటిఎఫ్ చేపట్టిన ఫ్యామిలీ వెల్ఫేర్ ఫండ్ దేశంలోనే ప్రతిష్టాత్మకమైన కార్యక్రమమని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్, రాష్ట్ర కార్యదర్శి సింహాచలం, కాప్రా మండల ఎంఈఓ నరసింహులు, టీఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు కే. జయసింహా రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేపల్లి మదన్ రెడ్డి, జిల్లా నాయకులు, వివిధ మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనార్టీల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి

: హైదరాబాద్ డిసిసి అధ్యక్షులు ఖాలీద్ సైపుల్లా

రంజాన్ మాసం సందర్భంగా ఈద్ కా తోఫా పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

చార్మినార్,మార్చి 12 ప్రభాతవార్త :

మైనార్టీల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు సయ్యద్ ఖాలీద్ సైపుల్లా అన్నారు.రంజాన్ మాసం సందర్భంగా ప్రభుత్వం తరుపున గురువారం హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం, బహదూర్‌పుర నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలకు చెందిన మైనార్టీల కుటుంబాలకు ఈద్ కా తోఫాను ఆయన బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాహుల్‌తో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా సయ్యద్ ఖాలీద్ సైపుల్లా మాట్లాడుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం పాటు పడుతున్నదని తెలిపారు.హైదరాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాలలో ఈద్ కా తోఫా పంపిణీ జరిగిందని ఆయన తెలియజేశారు.బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జీ పులిపాటి రాహుల్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా కాంగ్రెస్ మీడియా ఇంఛార్జిమహ్మద్ నసీర్,కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఇక్బాల్,బానుచందర్ యాదవ్ పాల్గొన్నారు.

తుర్కా చెరువులో డ్రైనేజీ వాటర్

తురకచెరువులోని నీటిని మోటార్ల ద్వారా బయటికి పంపిస్తున్న అధికారులు

నిజాంపేట్, మార్చి 12, ప్రభాతవార్త

చదివిస్తే ఉన్న మతి పోయిందంట అట్లా ఉంది మన ఇంజినీరింగ్ అధికారుల పనితీరు. నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ పాలకమండలి పదవీకాలంలో తురకచెరువు సమీప కాలనీయులైన ఆర్జీకే సాయి నగర్, రామ్‌కి బ్యాక్ సైడ్ వర్షం నీరు తురకచెరువులో కలవడానికి అని ఏర్పాటు చేసిన పైప్ లైన్స్, కల్వర్టు ఆయా కాలనీల డ్రైనేజీ అంతా తుర్కా చెరువులోకి రావడానికి ఏర్పాటు చేసినట్టుగా ఉంది. దాదాపు 2018 వరకు తుర్కా చెరువులో ఎలాంటి డ్రైనేజీ అనేది కలవకపోవడం ద్వారా చెరువులో స్థానిక ముదిరాజ్ కులస్తులు చేపల పెంపకం చేపట్టేవారని, ఎప్పుడైతే నిజాంపేట గ్రామపంచాయతీ నుండి కార్పొరేషన్‌గా అవతరించిందో అప్పటి పాలక మండలి ముందు చూపు లేకపోవడం, టెండర్స్ ద్వారా వచ్చే డబ్బులకు కక్కుర్తి పడుతూ ఇంజనీరింగ్ అధికారుల పనితీరు వల్ల సమీప కాలనీల నుండి డ్రైనేజీ మొత్తం తురక చెరువులో కలవడం ద్వారా గుర్రపు డెక్క పేరుకుపోయింది. ఒకవైపు దోమల సమస్యతో పాటుగా చెరువులో డ్రైనేజీ కలవడం ద్వారా దుర్వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఎన్నిసార్లు స్థానిక కమిషనర్‌కి వినతి పత్రాలు సమర్పించిన చర్యలు మాత్రం శూన్యం. అప్పటి బిఆర్‌ఎస్ కార్పొరేటర్లు కేవలం దుర్గ చెరువులోని గుర్రపు డెక్కన్ తొలగించడానికి టెండర్ల ద్వారా కోట్ల రూపాయలు దండుకున్నారని వారికి తురకచెరువు అక్షయపాత్రలాగా దొరికింది. కానీ ప్రస్తుతం హైడ్రా ద్వారా తురకచెరువు సుందరీకరణలో భాగంగా ఒకవైపు తురక చెరువులో ఉన్న నీటిని మోటార్ పంపుల ద్వారా బయటికి పంపిస్తూ ఉంటే మరొకవైపు సాయి నగర్ రాజీవ్ గృహకల్ప, మై టాస్క్ నుండి వచ్చే డ్రైనేజీ మాత్రం చెరువులోకి వరద ప్రవాహం లాగా వచ్చి చేరుతుంది. ముందుగా బయటి నుండి వచ్చే డ్రైనేజీ చెరువులు కలవకుండా చూడవలసిన అధికారులు దాన్ని యధాతథంగా వదిలేసి మోటార్ల ద్వారా చెరువులో ఉన్న నీళ్లను మాత్రం పంపే మహా ప్రయత్నం చేస్తున్న అధికారుల తీరును చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. మొన్నటికి మొన్న కూడా ఇంజనీరింగ్ అధికారులకి ఈ విషయం తెలియజేసినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి ముందుగా చెరువులోకి వివిధ కాలనీల ద్వారా వచ్చే డ్రైనేజీ ప్రవాహాన్ని మళ్ళించడం ద్వారా దోమల సమస్య, గుర్రపు డెక్క సమస్యతో పాటుగా చెరువు సుందరీకరణ పనులు కూడా త్వరగా పూర్తవుతాయని, ఆ విధంగా తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రజల తరపున భారతీయ జనతా పార్టీ నిజాంపేట అధ్యక్షులు బిక్షపతి యాదవ్ అధికారులకు సూచించారు.

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దురక్రమణ దాడులపై ఖండన

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న షేక్ షావలి, సునీత, సంతోష్‌నాయక్, కళక్క తదితరులు

సైఫాబాద్, మార్చి 12 ప్రభాతవార్త: గత కొన్ని రోజులుగా అమెరికా, ఇజ్రాయెల్ విస్తరణ కాంక్షతో ఇరాన్‌పై జరుపుతున్న సామ్రాజ్యవాద దురాక్రమణ దాడులను సిపిఐ (ఎంఎల్) చంద్రపుల్లారెడి పార్టీ తీవ్రంగా ఖండించింది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ అధిపత్య దుక్రమణ దాడులకు వ్యతిరేకంగా ఈ నెల 23న ప్రముఖ స్వాతంత్ర సమర యోధులు భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతికి సంబంధించిన కరపత్రాలను గురువారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి షేక్ షావలి మాట్లాడుతూ అంతర్జాతీయ సమాజాన్ని, న్యాయ సూత్రాలను ఉల్లంఘించి ఇరాన్‌పై అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంఫ్ ఏకపక్ష దాడులకు తెగబడ్డారని ఆరోపించారు. ఈ యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనవలసి వస్తుందని, తక్షణమే ఐక్యరాజ్యసమితి, భద్రతా మండలి ప్రపంచ శాంతి కోసం కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మల్లెపలి ప్రభాకర్, సంపంగి పద్మ, చిట్టిబాబులను పార్టీ నుంచి బహిష్కరించినట్లు తెలిపారు. చంద్రపుల్లారెడ్డి పార్టీ పేరుతో వారు ఏలాంటి ప్రకటనలు జారీ చేసిన సహించేది లేదని హెచ్చరించారు. ఈ సమావేశంలో పార్టీ నేతలు సునీత, బానోతు సంతోష్‌నాయక్, సైదులు, శ్రీనివాస్ కళక్క, తదితరులు పాల్గొన్నారు.

మహిళా చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి : నర్మధ

మహిళా దినోత్సవ వేడుకల్లో కంటోన్మెంట్ బోర్డు మెంబర్ బానుక నర్మధ తదితరులు

కంటోన్మెంట్,మార్చి 12 ప్రభాతవార్త:

మహిళలు తమ హక్కులపై అవగాహన కలిగి ఉండాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి బోయిన్‌పల్లి సీతారాంపూర్‌లో నిర్వహించిన వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళల సాధికారత చట్ట బద్దత హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు పురుషుల కంటే దీటుగా అన్నిరంగాల్లో ప్రతిభకబర్చాలన్నారు. ఈ సందర్భంగా మహిళలకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు.

కంటోన్మెంట్ బోర్డు సిఇఓతో ఎమ్మెల్యే శ్రీగణేష్ భేటీ

కంటోన్మెంట్ బోర్డు సిఇఓతో భేటీ అయిన ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్, మార్చి 12 ప్రభాతవార్త:

కంటోన్మెంట్ బోర్డు సిఇఓ అరవింద్ కుమార్ ద్వివేదితో గురువారం ఎమ్మెల్యే శ్రీగణేష్ బోర్డు కార్యాలయంలో భేటీ అయ్యారు. ఈ భేటీలో రంజాన్ పండుగ సందర్భంగా నియోజకవర్గంలో ముస్లిం సోదర సోదరీమణులు ఆనందంగా పండుగను జరుపుకునేలా అన్ని దర్గాలు, మజీద్‌లు, వీధులన్నీ శుభ్రంగా ఉండేలా, వీధి దీపాలు అన్ని పూర్తి స్థాయిలో వెలిగేలా, డ్రైనేజీలు, మ్యాన్ హోల్స్ అన్నీ క్లీన్ గా ఉండేలా చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే వేసవిలో నియోజకవర్గ ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా పాడైపోయిన బోర్లను బాగు చేయించాలని, అవసరమైన చోట కొత్త బోర్లు వేయించి సక్రమంగా నీటి సరఫరా జరిగేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించడంతో సిఇఓ సంబధిత అధికారులకు వెంటనే తన కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలోనే తగిన ఆదేశాలు జారీ చేసి, పనులను వెంటనే చేపట్టి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. ఈ సమావేశంలో వీరితో పాటు హెల్త్ వాటర్ డిపార్ట్మెంట్ ల అధికారులు దేవేందర్, శశాంక్ పాల్గొన్నారు.

రాజేంద్రనగర్ మండలంలో 22 పరీక్షా కేంద్రాలు

-పదవ తరగతి పరీక్ష రాయనున్న 5080 మంది విద్యార్థులు

-మండల విద్యాధికారి శంకర్ రాథోడ్

అత్తాపూర్ మార్చి 12, ప్రభాతవార్త :

విద్యార్థులు ఒత్తిడికి లోనవ్వకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయలని మండల విద్యాధికారి శంకర్ రాథోడ్ పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ...ఈనెల 14 నుండి వచ్చే నెల 16వరకు కొనసాగే పదవ తరగతి పరీక్షలకు రాజేంద్రనగర్ మండలంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.మండలంలో ప్రభుత్వం,ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 5080 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని ప్రభుత్వం పాఠశాలల విద్యార్థులు 924 మంది ఉండగా ప్రైవేట్ పాఠశాల ల విద్యార్థులు 4156 మంది ఉన్నారని పరీక్షల నిర్వహణ కోసం మండలంలో మొత్తం 22 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని అదేవిధంగా చిఫ్ సూపరిడెంట్, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ నియమించామని అదనంగా మొత్తం 264 మంది ఇనిజిలేటర్లు పరీక్షల నిర్వహణలో విధులు నిర్వహిస్తారని సూచించారు.పరీక్షలు ప్రతి ఉదయం 9:30 గంటల నుండి మధ్యాహ్నం 12 : 30 గంటల వరకు ఉంటాయని విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు కనీసం అరగంట ముందు చేరుకోవాలని అవసరమైన హాల్ టికెట్ తీసుకురావాలని పరీక్ష కేంద్రాలకు మొబైల్ ఫోన్స్,ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతి ఉండదని తల్లిదండ్రులు ,పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థులు సమయానికి పరీక్షలకు హాజరవడానికి సహకరించాలని సూచించారు.

లైంగిక వేధింపుల కేసులో దోషికి 5 ఏళ్ళ జైలుశిక్ష

చాంద్రాయణగుట్ట, మార్చి 12, ప్రభాతవార్త : ఎనిమిదేళ్ళ మైనర్ బాలికపై లైంగిక వేధింపుల కేసులో నిందితుడికి కోర్టు 5 ఏదేళ్ళ కఠిన కారాగార శిక్ష విధించింది. చాంద్రాయ ణగుట్ట పోలీసుస్టేషన్ పరిధిలో జరిగిన కేసు వివరాలు... జీ.ఎం. కాలనీకి చెందిన అబ్దుల్ ఖయ్యూమ్ (23) అరబిక్ ఉపాధ్యాయుడు. 2019లో తన వద్దకు చదువుకోవటానికి వచ్చిన మైనర్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. సెల్‌ఫోన్ ఆశ చూపి లైంగికదాడికి యత్నించాడు. బాలిక గట్టిగా కేకలు వేయటంతో అక్కడి నుండి పారిపోయాడు. బాధిత బాలిక తల్లి చాంద్రాయణగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.కేసును విచారించిన నాంపల్లిలోని ప్రత్యేక సెషన్ జడ్జి జి.ఉదయ్ భాస్కర్ గురు వారం తుది తీర్పు వెలువరించారు. నిందితుడు అబ్దుల్ ఖయ్యూమ్‌ను దోషిగా నిర్ధారించి 5 ఏళ్ళ కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానాతోపాటు బాధితురాలికి లక్ష రూపాయా ల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. విచారణ అధికారు లు, ఎస్ఐలు జాకీర్ హుస్సేన్, ఎస్.వెంకటేష్, స్పెషల్ అడీ షనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.రమాదేవి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.ప్రతాపరెడ్డి, భరోసా టీం సభ్యులను నగర పోలీసు కమిష నర్ వి.సి. సజ్జనార్ అభినందించారు. మహిళా భద్రతా విభా గం డీసీపీ డాక్టర్ లావణ్య, ఏసీపీ ప్రసన్నలక్ష్మిలు కేసు పురోగ తిని నిరంతరం పర్యవేక్షించి దోషికి శిక్షపడేలా కృషి చేశారు.

రౌడీ షీటర్‌కు నెల రోజుల పాటు జైలు శిక్ష

చార్మినార్,మార్చి 12 ప్రభాతవార్త : బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన పాతబస్తీ కామాటిపుర పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ రౌడీ షీటర్‌కు న్యాయస్థానం నెల రోజుల పాటు జైలు శిక్ష విధించిందని రాజేంద్రనగర్ జోన్‌డిసిపి శ్రీనివాస్ తెలిపారు.పాతబస్తీ కామాటిపుర పోలీస్ పరిధిలో ఉన్న మహ్మద్ రియాజుద్దీన్ అలియాస్ రియాజ్ పై రౌడీషీట్ నమోదై ఉంది.గతంలో రౌడీషీటర్ రియాజుద్దీన్‌ను క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ కింద ఎగ్జిక్యూటివ్‌మెజిస్ట్రేట్ ముందు బైండోవర్ చేయటం జరిగింది.కాగా బైండోవర్ సమయంలోనే రౌడీషీటర్ రియాజ్ ఉద్దీన్ నిబంధనలు ఉల్లంఘించి కొత్త నేరానికి పాల్పడటాన్ని పోలీసులు గుర్తించారు.నింధితుడిని హైదరాబాద్ జిల్లా స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ కె.జ్యోతి ముందు ప్రవేశ పెట్టి గతంలో నింధితుడు ఇచ్చిన బాండ్‌ను రద్దు చేయాలని కామాటిపుర పోలీసులు కోరారు.కేసు పూర్వపరాలను పరిశీలించిన మెజిస్ట్రేట్ నెల రోజుల పాటు రౌడీషీటర్ రియాజుద్దీన్‌కు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారని డిపిసి తెలియజేశారు.కోర్టు ఆదేశాలు మేరకురౌడీ షీటర్ రియాజ్ ఉద్దీన్‌ను కామాటిపుర పోలీసులు అదుపులోకి తీసుకుని చంచల్‌గూడ జైలుకు తరలించారు.

కెపిహెచ్‌బి కాలనీలో పేకాటరాయుల అరెస్ట్.. 2.80 లక్షలు స్వాధీనం

కెపిహెచ్‌బి కాలనీ, మార్చి 12, ప్రభాతవార్త

కెపిహెచ్‌బి కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని భగత్ సింగ్ నగర్‌లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట నిర్వహిస్తున్న స్థావరంపై బాలనగర్ ఎస్ఓటి పోలీసులు బుధవారం రాత్రి దాడులు నిర్వహించారు. ముందస్తుగా అందిన పక్కా సమాచారంతో భగత్‌సింగ్ నగర్‌లోని ఓ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుండి సుమారు 2.80 లక్షల రూపాయల నగదు, 6 సెల్‌ఫోన్లను, 80 కాయిన్లు, 50 సెట్ల ప్లేయింగ్ కార్డ్స్ స్వాధీనం చేసుకున్నారు. నిందితులను తదుపరి విచారణ కోసం కెపిహెచ్‌బి కాలనీ పోలీసులు స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టెస్ట్ డ్రైవ్ పేరుతో బెంజి కారును ఎత్తుకెళ్లారు

జూబ్లీహిల్స్, మార్చి 12, ప్రభాతవార్తః టెస్ట్ డ్రైవ్ పేరుతో తీసుకెళ్లిన విలాసవంతమైన కారును తిరిగి ఇవ్వకుండా మోసగించిన సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. శ్రీనగర్‌కాలనీకి చెందిన బాధితుడు సయ్యద్ అష్ఫాక్ అహ్మద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. గత ఏడాది డిసెంబరు 16న చార్మినార్ ప్రాంతానికి చెందిన అక్బర్ ఖాన్ టెస్ట్ డ్రైవ్ పేరుతో మెర్సిడిస్ బెంజ్ జీఎల్ఏ 200డి కారును తీసుకెళ్లాడు. కారు తీసుకురాకపోవడంతో అష్ఫాక్ అతన్ని నిలదీశాడు. మాయమాటలు చెబుతూ వచ్చిన అతను కొద్ది రోజులకు కారును తనతోపాటు సఫీర్ అహ్మద్, సెకండ్ హ్యాండ్ కార్ల విక్రయదారు కార్స్ గలోర్‌తో కలిసి విక్రయించినట్లు చెప్పాడు. కారుకు సంబంధించిన డబ్బులు రూ. 25 లక్షలు చెల్లించేదుకు ఒప్పందం కుదుర్చుకొని కేవలం రూ. 2.5 లక్షలు చెల్లించి మిగిలిన మొత్తం చెల్లించలేదు. కారును తిరిగి ఇవ్వకుండా మోసానికి పాల్పడ్డారంటూ అష్ఫాక్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనికితోడు తనను బెదిరిస్తున్నారని, కారును అక్రమంగా విక్రయించి మోసగించారని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


ఉపాధి హామీ కూలీల నుంచి సంతకాలు సేకరిస్తున్న దృశ్యం

ఉపాధి హామీ కూలీల హక్కుల కోసం కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుంది : పూజల హరికృష్ణ

సిద్దిపేట అర్బన్,మార్చి 12,ప్రభాతవార్త : గ్రామీణ పేదల జీవనాధారమైన ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరిచేందుకు కేంద్రంలోని మోడీ సర్కార్ కుట్రలు పన్నుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నార. మండల పరిధిలోని తడ్కపల్లి, నాంచారుపల్లి, వెల్కటూర్, ఎల్లుపల్లి గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ కర్మచారి చైర్మన్ అఖిల్‌తో కలిసి పర్యటించి ఉపాధి హామీ కూలీలతో కలిసి మాట్లాడారు. వీబీజీ రాంజీ చట్టాన్ని మార్చాలని సంతకాల సేకరణ చేయడం జరుగుతుందన్నారు. ఉపాధి హామీ కూలీల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాటం చేస్తుందన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధులు కేటాయించకుండా పని దినాలు తగ్గించే ఆలోచనలో కేంద్ర సర్కార్ ఉందన్నారు. కాంగ్రెస్ సర్కార్ అధికారంలో ఉన్న సమయంలో పేదల కోసం తీసుకొచ్చిన ఈ చట్టాన్ని నిర్వీర్యం చేయాలనే మోడీ సర్కార్ కుట్రలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఉపాధి హామీ కూలీలకు వందరోజులు పని కల్పించాలని చేసిన కూలీ పనికి సమయానికి కూలీ డబ్బులు చెల్లించాలన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తే దేశ వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. కార్మికులు, పేదల కోసం కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుండి పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బిక్షపతి, పర్శరాములు, బొమ్మల యాదగిరి,కలీం, అంజయ్య, లక్ష్మీ, నర్సింహారెడ్డి, నరేష్, మహేష్‌గౌడ్, ఎర్ర మహేందర్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

నేడు సిద్దిపేటలో ప్రభుత్వ ఇఫ్తార్ విందు

సిద్దిపేట అర్బన్, మార్చి 12,ప్రభాతవార్త : రంజాన్ మాసంలో భాగంగా ఈనెల 13న సిద్దిపేటలో ప్రభుత్వం అధికారికంగా ఇఫ్తార్ విందు ఇవ్వడం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) తెలిపారు. సిద్దిపేటలో వారు గురువారం విలేకరులతో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని మదీనా ఫంక్షన్ హాల్‌లో సాయంత్రం ప్రభుత్వం అధికారికంగా ఇచ్చే ఇఫ్తార్ విందులో కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో పార్టీ నాయకులు కలీం, తప్పెట శంకర్, గయాజుద్దీన్, సతీష్‌గౌడ్, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

హుస్నాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో 'పరిశుభ్రత'

మార్కెట్ కమిటీ ముందు స్వచ్ఛత కార్యక్రమం దృశ్యం

హుస్నాబాద్ టౌన్, మార్చి 12, ప్రభాతవార్త : పట్టణంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం వ్యవసాయ మార్కెట్ లో మున్సిపల్ అధికారులు ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మీకొమురయ్య, కమిషనర్ మల్లికార్జున్ ఆదేశాల మేరకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి హాజరయ్యారు. ప్రజలు, మెప్మా రిసోర్స్‌పర్సన్స్, శానిటేషన్ సిబ్బంది కలిసి మార్కెట్‌ను శుభ్రపరిచి, చెత్తను డంప్ యార్డ్‌కు తరలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో మెప్మా ఏడీఎంసీ సంతోషిమాత, పర్యావరణ అధికారి రవికుమార్, జవాన్లు సారయ్య, ప్రభాకర్, మెప్మా రిసోర్స్ పర్సన్స్ మరియు సానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో సిసి రోడ్డు పనులకు శ్రీకారం

సిసి రోడ్డు పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

హుస్నాబాద్ రూరల్, మార్చి 12, ప్రభాతవార్త : మండలంలోని గాంధీనగర్ గ్రామంలో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు పోలు సంపత్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతులను మెరుగుపర్చడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజలకు సౌకర్యంగా ఉండే విధంగా నాణ్యమైన సీసీ రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బంక చందు, నియోజకవర్గ స్పోర్ట్స్ చైర్మన్ వెన్న రాజు, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు సాంకేతిక విద్యపై అవగహన ఉండాలి

ఎంఈఓ బచ్చలి సత్తయ్య

కొండపాక, మార్చి 12, ప్రభాతవార్త : విద్యార్థులు సాంకేతిక పరమైన అంశాలపై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ బచ్చలి సత్తయ్య అన్నారు. గురువారం కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఇండస్ట్రియల్ టూర్ ప్రోగ్రాం నిర్వహించి, కుకునూరుపల్లిలోని ఐటిటి కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక విద్యపై అవగహన కలిగి ఉండాలని సూచించారు. ఇండస్ట్రియల్ టూర్ ద్వారా విద్యార్థులు పరిశ్రమల పనితీరును, యంత్రాల వినియోగం, భద్రతా నియమాలు, భవిష్యత్ ఉద్యోగ అవకాశాల గురించి ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ వెంకటరమణ విద్యార్థులకు పలు అంశాలపై వివరించారు. కళాశాలలో సేఫ్టీ నియమాలను గురించి వివరించారు. పాఠ్యపుస్తకాలలో నేర్చుకున్న విషయాలు ప్రాక్టికల్‌గా చూడటం విద్యార్థులకు పరిశ్రమల పని విధానం తదితర అంశాలపై అవగహన పెంపొందించుకున్నారు. ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు అందిస్తున్న ఎలక్ట్రిషియన్, ఫిట్టర్, వెల్డర్, మెకానికల్, కంప్యూటర్ అపరేటర్, టైలరింగ్‌వంటి పలుకోర్సుల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఐటిఐలో యంత్రాల పనివిధానాన్ని పరిశీలిస్తున్న విద్యార్థులు

విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనివ్వాలి : ఎమ్మెల్యే

మిరుదొడ్డి, మార్చి 12,ప్రభాతవార్త : మండల పరిధిలోని అల్వాల ఎక్స్‌రోడ్ చెప్యాల పీఎంశ్రీ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాలలో నిర్మించ తలపెట్టిన కాంపౌండ్ వాల్ పనులకు గురువారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య భూమి పూజచేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ పాఠశాల చుట్టూ బలమైన కాంపౌండ్ వాల్ నిర్మించడం అవసరమని పేర్కొన్నారు. నిర్మాణంలో నాణ్యత పాటించాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పనుల్లో నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో పూర్తిచేసి అందుబాటులోకి తేవాలన్నారు. అనంతరం పాఠశాలలోని దాల్మెట్రీ, శౌచాలయాలను ప్రభాకర్‌రెడ్డి, బక్కి వెంకటయ్యలు సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు తగిన విధంగా లేకపోవడంతో పాఠశాల యజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులకు తాగునీరు, పరిశుభ్రమైన దాల్మెట్రీ శౌచాలయాలు ఇతర అవసరమైన సదుపాయాలను తక్షణమే మెరుగుపరచాలని ఆదేశించార. నిర్లక్ష్యం వహిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గురుకుల బాలుర పాఠశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్

ఎంఎల్‌హెచ్‌పి రాకేష్‌కు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

కొండాపూర్ మార్చి 12 ప్రభాతవార్త : ఆశావర్కర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ నేడు(శుక్రవారం) నిర్వహించే కలెక్టరేట్ ధర్నాను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు మాణిక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంఎల్‌హెచ్‌పి రాకేష్‌కు అందజేశారు. మాణిక్ మాట్లాడుతూ రాష్ట్రంలో 28 వేల మంది ఆశావర్కర్లు 20 సంవత్సరాలుగా పేద మహిళలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. గతంలో సమ్మెల సమయంలో ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు నెలకు రూ.18,000 స్థిర వేతనం ఇవ్వాలని, జనవరి, ఫిబ్రవరి నెలల పారితోషికాన్ని వెంటనే చెల్లించాలని కోరారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆశా వర్కర్ల డిమాండ్లను అమలు చేసి, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పిస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. కార్యక్రమంలో ఆశా వర్కర్ల యూనియన్ అధ్యక్షురాలు తుల్జమా, సంపూర్ణ, అనిత, స్వరూప, బాబురావు, రాజయ్య, అర్జున్ పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి పంటపై వర్క్ షాప్

కంది, మార్చి 12, ప్రభాతవార్త: రైతు శిక్షణ కేంద్రంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సంగుపేట్ ఆధ్వర్యంలో అధిక సాంద్రత పత్తి పంటపై వర్క్ షాప్ నిర్వహించారు. కార్యక్రమానికి తెలంగాణ రైతువిజ్ఞాన కేంద్రం సమన్వయకర్త శాస్త్రవేత్త డాక్టర్ కె అరుణ మాట్లాడుతూ అధిక సాంద్రత పద్దతిలో పత్తి సాగు చేయడంతో కలిగే ప్రయోజనాలపై రైతులకు వివరించారు. సాధారన పత్తి సాగు కంటే అధిక సాంద్రతతో సాగు చేసుకుంటే ఎకరాకు 22222 నుంచి 25000 వరకు మొక్కలు నాటుకోవచ్చన్నారు. పంట కాలం తక్కువగా ఉండటం మూలంగా ఒకే సారి పూత, కాయలు రావడం జరుగుతుందన్నారు. గులాబి రంగు కాయ తొల్చు పురుగు తెగులు బారి నుంచి కొంత వరకు తప్పించుకోవచ్చన్నారు. శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ మాట్లాడుతూ ఎరువుల వినియోగ సామర్థ్యం కూడా ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీరాంజిత, వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల శాస్త్రవేత్తలు యం శ్రీనివాసులు, పి లక్ష్మణ్‌రావు, సత్యానారాయణ, శాస్త్రవేత్త డాక్టర్ ఏ నిర్మల, సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, రైతు విజ్ఞాన కేంద్రం యంగ్ ప్రొఫెసర్-1 ఎస్ శ్రీకాంత్, కె ఆకాష్, రైతులు పాల్గొన్నారు.

రైతులు సేంద్రీయ వ్యవసాయంపై మొగ్గు చూపాలి

-మండల వ్యవసాయాధికారి రాము

మర్కుక్, మార్చి 12 (ప్రభాతవార్త): రైతులు ఎరువులు, పురుగుమందులు వాడకుండా సేంద్రీయ వ్యవసాయంపై మొగ్గు చూపాలని మర్కుక్ మండల వ్యవసాయాధికారి బోయినపల్లి రాము సూచించారు. గురువారం మండల పరిధిలోని ఎర్రవల్లి, వరదరాజపూర్ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ క్షేత్రంలో మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి రాము మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజాపాలన 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి రెవెన్యూ గ్రామంలో 10 మట్టి నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించనున్నట్లు తెలిపారు. ప్రతి రైతు మట్టి నమూనా పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. ఎరువులు, పురుగుమందులు అధిక మోతాదులో వాడటం వల్ల భూమి నిస్సారమవుతుందని, రైతులు భూమి ఆరోగ్యాన్ని కాపాడుకోవడం కోసం సేంద్రీయ వ్యవసాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి విష్ణు, రైతులు రాజిరెడ్డి, నరసింహారెడ్డి, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సస్య రక్షణ పద్దతులపై రైతులకు శిక్షణ

మిరుదొడ్డి, మార్చి 12, ప్రభాతవార్త :

మండల పరిధిలోని చెప్యాల రైతు వేదికలో గురువారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఆధ్వర్యంలో సమగ్ర సస్యరక్షణ పద్దతులపై రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహిం చారు. వరి, మొక్కజొన్న, పొద్దు తిరుగుడు పంటలలో పాటించాల్సిన యాజ మాన్య పద్దతులను ఏఆర్ఎస్ తోర్నాల శాస్త్రవేత్త రమాదేవి వివరించారు. ఎడిఏ తక్కువ పెట్టుబడి తో అధిక దిగుబడులు సాధించే నానో యూరియాపై అవగాహన కల్పించారు. రైతులు తమ సందేహాలను అధికారులతో మాట్లాడి నివృత్తి చేసుకున్నారు. కార్యక్రమంలో ఎడిఏ మల్లయ్య, ఎవో మల్లేశం, ఎటిఎం నరేష్‌రెడ్డి, ఏఈవోలు ప్రశాంత్, రేఖ,, ఎఎంసి డైరెక్టర్, సర్పంచ్, రైతులు పాల్గొన్నారు.

చింపాంజీ వేషధారణలో కోతులను తరిమి వేస్తున్న దృశ్యం

చింపాంజీ వేషధారణతో కోతుల నివారణ

కొమురవెల్లి, మార్చి 12,ప్రభాతవార్త : మండల కేంద్రంలోని కొమురవెల్లిలో కోతుల నివారణకు సర్పంచ్ గొల్లపల్లి పద్మ అంజనేయులు ఆధ్వర్యంలో గురువారం చింపాంజీ వేషధారణలో కోతులను ఊరి నుంచి బయటకు తరిమి వేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీనివాస్, వార్డు సభ్యులు,పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు గొల్లపల్లి కిష్టయ్య, శ్రీనివాస్, కనకయ్య, ప్రజలు, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కారానికి కృషి చేయాలి

సిద్దిపేట రూరల్, మార్చి 12,ప్రభాతవార్త : రైతుల సమస్యలను పరిష్కరించేందుకు రాజకీయాలకతీతంగా అందరూ కలిసి కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని యువనాయకుడు వంగ రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామానికి చెందిన రైతులు తమ పంట పొలాలు ఎండిపోతున్న నేపథ్యంలో వెంకయ్యచెరువును నింపి పంటలను కాపాడాలని వంగ రాజేశ్వర్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. రంగనాయసాగర్ ఎడమ కాలువ తమ పొలాల గుండా 10 కిలోమీటర్ల మేర ప్రవహిస్తున్న తమకు ఎలాంటి ఉపయోగం లేదని రైతులు వివరించారు. అలాగే మల్లన్నసాగర్ ఆర్-3 కాలువ పనులు మధ్యలోనే నిలిచిపోయయాని వాటిని పూర్తి చేసి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీంతో ఆయన గురువారం గ్రామానికి వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని అవసరమైతే వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఒగ్గు రాజేష్, పుల్లూరు ఆలయ కమిటీ చైర్మన్ పుల్లూరి కనకయ్య, దేశెట్టి తిరుపతి, వార్డు సభ్యులు యోగి, వైనాష్ యాదవ్, కుంచం నాగరాజు, మొలుగు ప్రవీణ్, బొందని శ్రీకాంత్, బొందని రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రైతులపై వివక్షత చూపుతున్న కాంగ్రెస్ సర్కార్

సిద్దిపేట రూరల్, మార్చి 12,ప్రభాతవార్త : నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొంది, చిన్నకోడూరు మండల పరిధిలోని గంగాపూర్ గ్రామాలకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ప్రత్యేక కృషితో పంట పొలాలకు సాగునీరు రావడంతో గురువారం ఆయా గ్రామాల సర్పంచ్‌లు, రైతులు ఆధ్వర్యంలో మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగునీరు అందక రైతులు పడుతున్న ఇబ్బందులను హరీష్‌రావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి తన సొంత ఖర్చులతో మిషన్ ఏర్పాటు చేసి కాలువలు తవ్వించి సాగునీరు అందించారని తెలిపారు. నియోజకవర్గ రైతుల పట్ల హరీష్‌రావు 24 గంటలు ప్రత్యేక దృష్టిసారించి పనిచేస్తున్నారని తెలిపారు. వచ్చే యాసంగి నాటికి కాంగ్రెస్ ప్రభుత్వం పెండింగ్‌లోఉన్న కాల్వపనులు పూర్తిచేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ రైతులపై పూర్తిగా వివక్షత చూపుతుందన్నారు. సొంత ఖర్చులతో రూ.2 లక్షలతో కాలువ తవ్వించి పంట పొలాలకు సాగనీరు అందించిన హరీష్‌రావుకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు భవాని వేణుయాదవ్, స్వప్న హరీష్, మాజీ సర్పంచ్ రామగౌడ్, రైతులు పాల్గొన్నారు.

కెసిఆర్, హరీష్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

సమాజసేవలో విద్యార్థులు భాగస్వాములు కావాలి

మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్

నర్సాపూర్, మార్చి 12, ప్రభాతవార్త :

విద్యార్థులు సమాజ సేవలో భాగస్వాములు కావాలని నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీ రాజుయాదవ్ అన్నారు. గురువారం నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ హుస్సేన్ ఆధ్వర్యంలో దత్తత గ్రామం హన్మంతాపూర్‌లో ఎన్ఎస్ఎస్ 7 రోజుల ప్రత్యేక శీతాకాల శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నర్సాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ఎం.లక్ష్మీరాజుయాదవ్, ప్రత్యేక అతిథులుగా కౌన్సిలర్ నర్సమ్మ, షహనాజ్ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ చైర్మన్ ఎస్. సాకేత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సమీరా నజ్నీన్ అధ్యక్షత వహించగా 72 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీరాజుయాదవ్ మాట్లాడుతూ, విద్యార్థులు సమాజంలో భాగ స్వాములు కావాలని ఎన్ఎస్ఎస్ మాత్రమే విద్యార్థులకు సేవా భావనను నేర్పించడమే కాకుండా, సమాజంలోని వాస్తవ సమస్యలను అర్థం చేసుకునే అవకాశాన్ని కల్పిస్తుందని అన్నారు, కౌన్సిలర్ నర్సమ్మ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ క్యాంప్‌ద్వారా వలంటీర్లు ఏడు రోజుల పాటు గ్రామంలో శుభ్రత విద్య ఆరోగ్యం వంటి అవగాహన కల్పించడం కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, డాక్టర్ ఆదెప్ప, డాక్టర్ రమేష్, డాక్టర్ రవి, కుమార్ హేమంత్ కుమార్, మహేందర్ రెడ్డి, రాజు, రాములు మరియు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు

ఎన్ఎస్ఎస్ శీతాకాల శిబిరంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్, కళాశాల ప్రతినిధులు

15వ ఆర్థిక సంఘం నిధులతో జీతాలు చెల్లించొద్దు

సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కృష్ణానాయక్

హుస్నాబాద్ రూరల్, మార్చి 12, ప్రభాతవార్త : గ్రామాలలో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్లకు జీతాలను 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి చెల్లించాలని ప్రభుత్వం సర్క్యులు జారీచేయడంపై సర్పంచ్‌లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈనేపథ్యంలో సర్పంచ్‌ల ఫోరం అక్కన్నపేట మండల అధ్యక్షుడు భూక్య కృష్ణానాయక్ మాట్లాడుతూ కేంద్రం నుంచి వచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు ప్రధానంగా తాగునీటి సరఫరా, పారిశుధ్యం, వీధి దీపాల నిర్వహణ, మొక్కల పెంపకం వంటి అభివృద్ధి పనులకు వినియోగించాల్సి ఉంటుందన్నారు. ఈ నిధుల నుంచే మల్టీపర్పస్ వర్కర్ల జీతాలు చెల్లిస్తే గ్రామాభివృద్ధి పనులకు అవసరమైన నిధులు తగ్గిపోవడంతో అనేక ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నాయని, గతంలో రాష్ట్ర ప్రభుత్వం టీఎస్‌బి పాస్ ద్వారా ఈ వర్కర్లకు జీతాలు చెల్లించేదని, అదేవిధంగా కొనసాగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఇక గ్రామాలలో రెండు సంవత్సరాలుగా పాలకవర్గాలు లేకపోవడంతో ఇప్పటికే అనేక సమస్యలు ఎదురవుతున్నాయని, గ్రామాల అభివృద్ధి పనులకు కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధులకు ఎటువంటి అడ్డంకులు కలగకుండా చూడాలని జిల్లాలోని అన్ని గ్రామాల సర్పంచ్‌ల తరుపున ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

విద్యార్థులకు ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీ

కొండపాక, మార్చి 12, ప్రభాతవార్త : విద్యార్థులు శ్రద్ధగాచదివి పరీక్షలు రాసి ఉన్నతస్థాయికి చేరుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ విరుపాక శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. గురువారం కొండపాకలోని కస్తూర్బా పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను, పెన్నులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి వత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలురాసి జిల్లాలో పాఠశాలను మొదటి స్థానంలో నిలపాలని ఆయన అకాంక్షించారు. పదవతరగతి విద్యార్థులకు చదువులో ఇదే మొదటి మెట్టు అన్నారు. అనంతరం ప్రిన్సిపల్ గౌమతి మాట్లాడుతూ పదవ తరగతి ఫైనల్ పరీక్షలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు ప్యాడ్‌లను, పెన్నులను పంపిణీ చేసినందుకు అయనకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుల బృందం పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

సంగారెడ్డి మున్సిపాలిటీ, మార్చి 12, ప్రభాతవార్త: రైతు శిక్షణ కేంద్రం సంగారెడ్డిలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సంగుపేట్ వారి ఆధ్వర్యంలో గురువారం అధిక సాంద్రత పత్తిపంటపై వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త (కోఆర్డినేటర్) శాస్త్రవేత్త డా. కె.అరుణ మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతిలో వేసిన ప్రత్తి పంట సాధారణ ప్రత్తి సాగు కంటే ఈ అధిక సాంద్రత ప్రత్తి సాగు పద్ధతిలో సాగు చేస్తే మేలైన దిగుబడి వస్తుందన్నారు. శాస్త్రవేత్త రాహుల్ విశ్వకర్మ మాట్లాడుతూ అధిక సాంద్రత పద్ధతి పత్తి వల్ల పంటకాలం తగ్గించి రెండవ పంట విత్తుటకు ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ పాలిటెక్నిక్‌నుంచి వచ్చిన శాస్త్రవేత్త డా. రజిత, వ్యవసాయ ఇంజనీరింగ్ కళాశాల శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, లక్ష్మణ్‌రావు, సత్యనారాయణ, శాస్త్రవేత్త డా. ఏ.నిర్మల వ్యవసాయ అధికారులకు ప్రతి పంటపై యాజమాన్య పద్ధతులు చీడపీడల యాజమాన్యం వివిధ అంశాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, యంగ్ ప్రొఫెషనల్ ఎస్.శ్రీకాంత్, కె.ఆకాష్, రైతులు, పాల్గొన్నారు.

కూరగాయలపై పురుగు మందుల వాడకం తగ్గించాలి

కొండపాక, మార్చి 12, ప్రభాతవార్త : పత్తి రైతులు తప్పని సరిగా మట్టిపరీక్షలు చేయించుకోవాలని గజ్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు బాబు నాయక్ అన్నారు. మండల పరిధిలోని ముద్దాపూర్‌లో అత్మ అధ్వర్యంలో నానో యూరియా వాడకంపై రైతలకు అవగహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ కూరగాయల సాగుపైన పురుగు మందుల వాడకం తగ్గించి వేప నూనెను వాడలని సూచించారు. మొక్కజొన్న పంటను సాగు చేస్తున్న రైతులు నానో యూరియా వాడకంపై అవగహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ తూం శ్రీకాంత్‌రెడ్డి, ఎఒ గోవిందరాజు, ఎఈఒ శ్రీహరి, అత్మబ్లాక్ అధికారి అశ్లేష, బాతర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

సిద్దిపేట రూరల్, మార్చి 12, ప్రభాతవార్త : సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని ఇరుకోడు గ్రామానికి చెందిన కుచ్చుల రాజయ్య ప్రమాదవశాత్తు చిన్న గ్యాస్ సిలిండర్ పేలడంతో తీవ్రంగా గాయపడి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న యువ నాయకులు వంగ రాజేశ్వర్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించి ధైర్యం చెప్పారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మిరుదొడ్డి, మార్చి 12,ప్రభాతవార్త : మండల పరిధిలోని లింగుపల్లి గ్రామానికి చెందిన మహేష్ తండ్రి గంగయ్య ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబీకులను ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య గురువారం పరామర్శించి ఓదార్చారు. వారివెంట బిఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

చెత్తబుట్టలను పంపిణీ చేస్తున్న మున్సిపల్ అధికారులు

గజ్వేల్, మార్చి 12 (ప్రభాతవార్త): ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా గురువారం గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన రవీందర్, వైస్ చైర్మన్ కళ్యాణ్‌కార్ పద్మాబాయి, కమిషనర్ వెంకటగోపాల్, కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి చెత్తబుట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తడిచెత్త, పొడిచెత్తను వేరుచేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలన్నారు. మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. అనంతరం పట్టణంలోని మార్కెట్ ప్రధాన కూడళ్లలో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. మురికికాల్వలను శుభ్రం చేయించడంతో పాటు రోడ్డు పక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారు. పట్టణాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో క్షేత్ర స్థాయిలో మున్సిపల్ యంత్రాంగం పర్యటించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ల పంపిణీ

అక్కన్నపేట, మార్చి 12, ప్రభాతవార్త : అక్కన్నపేట మండలం రామవరం,గౌరవెల్లి గ్రామాల్లో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు ఎగ్జామ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని మున్నాభాయ్ శ్రీనివాస్, డాక్టర్ బాలురాజు, సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పెన్నులు, స్కేల్స్, హాల్ టికెట్ కవర్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రామవరం గ్రామ సర్పంచ్ బొమ్మ శ్రీశైలం, వార్డు సభ్యులు బానోతు భాస్కర్ నాయక్, బానోత్ తిరుపతి నాయక్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ వినియోగదారులు ఈకేవైసి నమోదు చేసుకోవాలి

గజ్వేల్ టౌన్, మార్చి 12 (ప్రభాతవార్త): గ్యాస్ వినియోగదారులు ఈ-కేవైసీ(ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) నమోదు చేయించుకోవాలని గజ్వేల్ శేషమా ఇండియన్ గ్యాస్ నిర్వాహకుడు నంబూరి రామలింగేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం సూచనల మేరకు దేశవ్యాప్తంగా గ్యాస్ కనెక్షన్లను ఆధార్‌తో అనుసంధానం చేస్తూ ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. గతకొన్ని నెలలుగా గ్యాస్ డీలర్లు మొబైల్ యాప్‌ల ద్వారా వినియోగదారుల వద్దకు వెళ్లి ఈ-కేవైసీ నమోదు చేస్తున్నారని తెలిపారు. కొంత మంది వినియోగదారులు సిలిండర్ సరఫరా సమయంలోనే ఈ ప్రక్రియ పూర్తి చేస్తున్నారని చెప్పారు. అయినప్పటికీ ఇప్పటి వరకు లక్ష్యానికి తగ్గ స్థాయిలో నమోదు జరగలేదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రతి గ్యాస్ వినియోగదారు తప్పనిసరిగా ఈ-కేవైసి పూర్తి చేసుకోవాలని సూచించారు.

రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందని గడపలేదు

-గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి

ములుగు, మార్చి 12, ప్రభాతవార్త:
తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని గడపలేదని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అన్నారు. గురువారం ములుగు మండల పరిధిలోని క్షీరసాగర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని వంటిమామిడి మార్కెట్‌కమిటీ చైర్మన్ బాగనోళ్ల విజయమోహన్, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షులు కొన్యాల బాల్‌రెడ్డి, జిల్లా రాజీవ్ సంఘటన్ అధ్యక్షులు కడవల్ల నరసింహారెడ్డి, లబ్దిదారులతో కలిసి గృహప్రవేశం చేశారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంచేపట్టిన ఇందిరమ్మ ఇళ్లపథకంతో ఎంతో మంది పేదలు సొంత ఇల్లు నిర్మించుకొని సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు, సబ్సిడీపై గ్యాస్ సరఫరా, గ్రూప్-వన్ పరీక్షలతో ఉద్యోగుల నియామకం, టీచర్ల నియామకం వంటి ఎన్నో గొప్ప పనులకు శ్రీకారంచుట్టి ఎలాంటి అవకతవకలు లేకుండా అమలుచేస్తున్నారని కొనియాడారు. అనంతరం గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలకు రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న ప్రహరీ గోడ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్ కొడిత్యాల ప్రభాకర్‌గుప్తా, సర్పంచులు శ్రీధర్‌రెడ్డి, ముత్యంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు తమ్మలి శ్రీనివాస్, ఉపసర్పంచి పరశురాం, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ఎంపిని కలిసిన ఎస్‌జిటియు నాయకులు

ఎంపి నరేందర్‌రెడ్డిని కలిసిన ఉపాధ్యాయ ఎస్‌జిటియు నాయకులు

వెల్దుర్తి, మార్చి 12, ప్రభాతవార్త:
ముఖ్యమంత్రి సలహాదారు, ఎంపి నరేందర్‌రెడ్డిని తెలంగాణ ఎస్‌జిటియు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాజ్యసభ సభ్యులుగా ఎన్నికైనందుకు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు వి.లచ్చిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు కె.మహిపాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధానకార్యదర్శి ఎ.వెంకటేశంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలు పరిష్కరించాలని ముఖ్యమంత్రి దృష్టికితీసుకెళ్లాలని నరేందర్ రెడ్డికి విజ్ఞప్తిచేశారు, అందుకు వారు సానుకూలంగా స్పందించడం జరిగిందన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు, ఇతర సమస్యలను సిఎందృష్టికి తీసుకెళ్తానని హామీ ఇవ్వడం జరిగిందని వారు తెలిపారు.

అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రామాయంపేట, మార్చి 12, ప్రభాతవార్త:
అగ్నిప్రమాదాల నుండి విద్యార్థులు, ప్రజలు రక్షించుకోవాలంటే ముందస్తు అవగాహనే నిజమైన రక్షణ అని అగ్నిమాపక అధికారులు సూచించారు. గురువారం 99రోజుల ప్రణాళికలోభాగంగా రామాయంపేట మండలం అక్కన్నపేట జిల్లాపరిషత్ హైస్కూల్‌లో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు ఎలా స్పందించాలి, వాటిని ఎలా నివారించాలి అనే అంశాలపై విద్యార్థుల్లో చైతన్యం పెంచేందుకు ఈకార్యక్రమం చేపట్టినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ప్రమాదం జరిగినప్పుడు వెంటనే చేయాల్సిన చర్యలను సిబ్బంది విద్యార్థులకు వివరిస్తూ ప్రదర్శనలు ఇచ్చారు. అగ్నిప్రమాదం సంభవించినప్పుడు గందరగోళానికి లోనుకాకుండా, సమయస్ఫూర్తితో స్పందించాలన్నారు. ఇంట్లో గ్యాస్, విద్యుత్ పరికరాల వినియోగంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ సిబ్బంది నరేష్, శంకర్, చంద్రగౌడ్, నవీన్‌గౌడ్, నర్సగౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు కూడా పాల్గొని విద్యార్థులకు భద్రతాసూచనలు తెలియజేశారు.

పిఎంశ్రీ జడ్పిహెచ్‌ఎస్‌లో వార్షికోత్సవం

పిఎంశ్రీ జడ్పిహెచ్‌ఎస్‌లో వార్షికోత్సవం జరుపుకుంటున్న విద్యార్థులు

సిర్గాపూర్, మార్చి 12, ప్రభాతవార్త:
మండల కేంద్రమైన సిర్గాపూర్‌లోని పిఎంశ్రీ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన కంగ్టి సిఐ వెంకట్‌రెడ్డి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో విద్యను అందుకుంటేనే ఉన్నత స్థానాలకు చేరుకుంటారని, తూతూమంత్రంగా విద్యను అందుకుంటే తమను గుర్తించేవారు ఉండరన్నారు. ఎంఈఓ నాగారం శ్రీనివాస్ మాట్లాడుతూ క్రమశిక్షణ మనషిని ఉన్నతశిఖరాలకు చేరుస్తుందన్నారు. వార్షికోత్సవాన్ని సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు స్కిట్స్, పాటలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈసందర్భంగా ప్రతిభచాటిన విద్యార్థులకు బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ్, ఉపాధ్యాయులు నిహారిక, లక్ష్మీ, మధుకర్‌రెడ్డి, వరప్రకాశ్, నాగభూషణం, శ్రీరామ్, సచిన్, రాంచందర్, మహేందర్, సంతోష్, అన్నారీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తుకు బానిసలు కావొద్దు

-జోగిపేట ఎక్సైజ్ సిఐ సాగర్‌రెడ్డి

యువతతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎక్సైజ్ సిఐ సాగర్‌రెడ్డి

చౌటకూరు, మార్చి 12, ప్రభాతవార్త:
యువత, విద్యార్థులు మత్తుకు బానిసలు కావొద్దని జోగిపేట ఎక్సైజ్ సిఐ సాగర్‌రెడ్డి అన్నారు. మండలపరిధిలోని సుల్తాన్‌పూర్, కోర్పోలు, చౌటకూరు గ్రామాల్లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యాచరణలో భాగంగా గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సాగర్‌రెడ్డి మాట్లాడుతూ మత్తుపదార్థాల వలన కలిగే అనర్థాలపై వివరించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ విజయ్‌కుమార్, నాయకులు నల్లగండ్ల వెంకటరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

పరీక్షల రవాణాఖర్చులు నేనే భరిస్తా: సర్పంచి

-సర్పంచి రాజునాయక్

అక్కన్నపేట, మార్చి 12, ప్రభాతవార్త:
అక్కన్నపేట జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో పదవతరగతి చదువుతున్న విద్యార్థులకు పంతులుతండా సర్పంచి రాజు(చిన్నా)నాయక్ గురువారం శుభాకాంక్షలు తెలిపారు. పరీక్షలసమయంలో విద్యార్థులకు వారి నివాస ప్రాంతం నుండి పరీక్షాకేంద్రం వరకు వెళ్లడానికి అవసరమైన ఆటో లేదా బస్సు ఛార్జీలను తానే భరిస్తానని ఆయన ప్రకటించారు. ఈసందర్భంగా గ్రామప్రజలు, సర్పంచి తీసుకున్న నిర్ణయాన్ని అభినందించారు.

నల్లవాగు ప్రాజెక్టులో తగ్గుతున్న నీటి మట్టం

నల్లవాగు ప్రాజెక్టు దృశ్యం

సిర్గాపూర్, మార్చి 12, ప్రభాతవార్త:
మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గుతూ వస్తోంది. గత వర్షాకాలంలో పూర్తిస్థాయిలో నిండిన ప్రాజెక్టు రబీ సాగుకు నీటిని విడుదల చేయడంతో ప్రస్తుతం ప్రాజెక్టులో 1488 ఫీట్లకు నీరు చేరుకుంది. వరి, జొన్న పంటల సాగుకు ఇప్పటికే మూడు తడుల నీటిని అందించగా డ్యాం గరిష్ఠ మట్టం 1493 ఫీట్ల నుంచి 5అడుగులు తగ్గింది. ఆయకట్టకు సాగునీరు అందేలా అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నారు. నల్లవాగు ప్రాజెక్టు నుంచి యాసంగి సేద్యానికి 3వ విడత సాగునీటిని విడుదల చేస్తున్నామని, కల్హేర్ మండలంలని ఇందిరానగర్ వరకు చివరి ఆయకట్టు వరకు సాగునీటిని అందిస్తామని ప్రాజెక్టు ఏఈ శ్రీవర్ధన్‌రెడ్డి తెలిపారు. మరో 2రోజుల్లో నీటి విడుదల నిలిపివేస్తామన్నారు. 15 రోజుల తర్వాత 4వ విడత నీటిని చివరగా విడుదల చేస్తామన్నారు. నీటిని వృథాచేయకుండా పొదుపుగా వాడుకోవాలని రైతులకు శ్రీవర్ధన్‌రెడ్డి సూచించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో కుడి, ఎడమ కాలువల ద్వారా 4250ఎకరాల ఆడుతడి పంటలకు సాగునీరు అందుతుందన్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1498 అడుగులు కాగా, ప్రస్తుతం ప్రాజెక్టులో 1488 అడుగుల నీరు ఉన్నట్లు అధికారి వివరించారు.

బిఆర్‌ఎస్ నాయకుడిపై కాంగ్రెస్ నాయకుల దాడి

విలేకరులతో మాట్లాడుతున్న బిఆర్‌ఎస్ నాయకులు

శివంపేట, మార్చి 12, ప్రభాతవార్త:
బిఆర్‌ఎస్ నాయకుడిపై కాంగ్రెస్ నాయకులు దాడిచేసిన ఘటన శివంపేట మండలం కొంతాన్‌పల్లి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు బిఆర్‌ఎస్ నాయకుడు ఆకుల శ్రీనివాస్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను పొలంలో వ్యవసాయపనులు చేస్తుండగా కాంగ్రెస్‌పార్టీ నాయకులు పిఎసిఎస్ మాజీ చైర్మన్ వెంకటరాంరెడ్డి, టేకులపల్లి రవీందర్‌రెడ్డి, కలకంటి వెంకటేష్ అనే ముగ్గురు కలిసి ఒక్కసారిగా మెడలో ఉన్న తువాలను మెడకు చుట్టి బిగించి కాంగ్రెస్‌పార్టీలోకి రావా అంటూ దాడిచేశారని తెలిపారు. అదేవిధంగా తనకారు తాళం తీసుకొని కారును సైతం తీసుకెళ్లారని ఆయన అన్నారు. అధికారం ఉందని దురహంకారంతోనే ప్రతిపక్షనాయకులపై దాడులు చేయడం సరైందికాదని, అధికారపార్టీ నేతల దౌర్జన్యాలపై బిఆర్‌ఎస్ నాయకులు మండిపడ్డారు. ఈ విషయమై బాధితుడు ఆకుల శ్రీనివాస్ ముగ్గురు కాంగ్రెస్ నాయకులపై ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మధుకర్‌రెడ్డి తెలిపారు.

డ్రోన్‌లకు సబ్సిడీ.. దరఖాస్తులు ఆహ్వానం

గుమ్మడిదల, మార్చి 12, ప్రభాతవార్త:
గుమ్మడిదల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న వ్యవసాయ యాంత్రీకరణపై సబ్సిడీపై వ్యవసాయ డ్రోన్‌లను అందజేయడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు గుమ్మడిదల మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ పథకానికి మహిళాసంఘాలు, ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు, రైతు ఉత్పాదకసంఘాలు అర్హులని తెలిపారు. డ్రోన్‌ల ద్వారా పంటలపై మందులు, ఎరువులు వేయడం తక్కువసమయంలో, తక్కువ ఖర్చుతో చేయవచ్చని అన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన మహిళాసంఘాలు, పాక్స్‌సంఘాలు, రైతుఉత్పాదకసంఘాలు సమీపవ్యవసాయశాఖ కార్యాలయాన్ని సంప్రతించి దరఖాస్తుచేసుకోవాలని శ్రీనివాస్‌రావు విజ్ఞప్తిచేశారు.

గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలపై చర్చించాలి

-సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు

వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు

నర్సాపూర్, మార్చి 12, ప్రభాతవార్త:
గత ఎన్నికల ముందు గ్రామపంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను ఈ అసెంబ్లీ సమావేశాలలో చర్చించాలని, సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు అన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై అసెంబ్లీ సమావేశంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి చర్చించాలని కోరుతూ గురువారం నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కడారి నాగరాజు మాట్లాడుతూ, మార్చి 17వ తేదీన చలో హైదరాబాద్ కార్యక్రమంలో జిల్లాలో ఉన్న గ్రామపంచాయతీ కార్మికులందరూ అధికసంఖ్యలో పాల్గొని జయప్రదంచేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘంనాయకులు చంద్రయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌పివి వ్యాక్సిన్ ఆడబిడ్డలకు రక్షణకవచం

-ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

వ్యాక్సిన్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావని

నర్సాపూర్, మార్చి 12, ప్రభాతవార్త:
హెచ్‌పివి వ్యాక్సిన్ భవిష్యత్తులో ఆడపిల్లలకు రక్షణకవచం లాంటిదని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మాచునూరి లక్ష్మీరాజుయాదవ్‌తోపాటు ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావనిలు లాంఛనంగా వ్యాక్సిన్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డితో పాటు, నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజుయాదవ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పావని, డాక్టర్ రాజేష్, ఆసుపత్రి సిబ్బంది, పిహెచ్‌సి డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు

-ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవి

మెదక్, మార్చి 12, ప్రభాతవార్త:
ఇంటర్మీడియట్ రెండవ సంవత్సర కెమిస్ట్రీ 1, కామర్స్ 1 పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా ముగిసాయి. మొదటి సంవత్సర పరీక్షలలో జనరల్ విభాగంలో 6085గాను 5895విద్యార్థులు హాజరైనారు. ఒకేషనల్ విభాగంలో 279గాను 260విద్యార్థులు పరీక్షకు హాజరైనారు. జిల్లాలో పదకొండవరోజు హాజరుశాతం 96.71గా నమోదైంది. ఈరోజుతో మొదటి సంవత్సర పరీక్షలు పూర్తికావడం జరిగింది. ఈసంవత్సరం ఐదు నిమిషాల నిబంధన అమలులో ఉండటంతో విద్యార్థులందరూ సమయానికి పరీక్షాకేంద్రాలకు చేరుకున్నారు. జిల్లాలో ఉన్న పరీక్షాకేంద్రాలను జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవి, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు, ఫ్లైయింగ్ స్క్వాడ్ పర్యవీక్షణ ప్రశాంతంగా ముగిసాయి.

ఉగ్గెల్లి తండాలో ఉచిత ఆరోగ్య శిబిరం

జహీరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:
మండల పరిధిలోని ఉగ్గెల్లి తండాలో గురువారం సర్పంచి రాథోడ్ జెనీబాయి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామస్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామంలో ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశామని సర్పంచి పేర్కొన్నారు. శిబిరానికి చేరుకున్న ప్రజలకు డాక్టర్ రామ్‌నాథ్, వైద్యసిబ్బంది డాక్టర్ మధులత, ఎంపిహెచ్‌ఎ రేణుక, శ్రీనివాస్‌రాజు, ఆశావర్కర్ జనబాయి, శ్యామల, ప్రవీణలు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సమత, ఉపసర్పంచి కాంతారాం, వార్డు సభ్యులు బిక్కిబాయి, రుక్కిబాయి, సంజు రాథోడ్, ప్రియాంక, జైసింగ్, నాయకులు మాజీ ఉపసర్పంచి బిక్కు మధుజాదవ్, మోహన్ రాథోడ్, శేఖీల్‌రాథోడ్, అర్చకులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ ఫీల్డ్ డే

వడ్డిలో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ ఫీల్డ్ డే దృశ్యం

న్యాల్‌కల్, మార్చి 12, ప్రభాతవార్త:
మండలపరిధిలోని వడ్డిగ్రామంలో గురువారం నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ ఆధ్వర్యంలో ఫీల్డ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో 41రకాల విత్తనాలను రైతులకు పంపిణీచేశారు. ఈవిత్తనాల సాగుతో పశుగ్రాసం కోసం ఉపయోగపడుతుందని మండల వ్యవసాయ అధికారి ఎన్.అభినాష్‌వర్మ పేర్కొన్నారు. జొన్నపంట సాగుపద్ధతులపై, పురుగు, వ్యాధి నియంత్రణ చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ మాధవి, రైతులు పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాల నిరక్షరాస్యులకు రాత సామగ్రి పంపిణీ

పుల్‌కల్, మార్చి 12, ప్రభాతవార్త:
మండల పరిధిలోని గోంగూలూర్ తండాలో రోటరీ క్లబ్ ఆఫ్ మంజీరా వారు 30మంది స్వయం సహాయక సంఘాల నిరక్షరాస్యులకు రాత సామగ్రిని పంపిణీచేశారు. ప్రతి మహిళ అక్షరాస్యురాలు కావాలని, అమ్మాయి చదువు సమాజానికి మలుపని సంగారెడ్డి రోటరీ క్లబ్ ఆఫ్ మంజీర అధ్యక్షులు ఎ.కిషన్ అన్నారు. మహిళలందరినీ అక్షరాస్యులుగా మార్చేందుకు 2022 నుంచి 2027 వరకు కార్యాచరణ పెట్టుకున్నట్లు, ఐదేళ్లలో 5కోట్లమందిని అక్షరాస్యులుగా చేయాలనే సంకల్పం పెట్టుకున్నామన్నారు. అక్షరాస్యత ప్రాథమిక విద్య ప్రతి వ్యక్తి జీవితంలో అత్యంత కీలకమైనదని విశ్రాంత మండల విద్యాధికారి, రోటరీ క్లబ్ సభ్యులు డి.అంజయ్య అన్నారు. సంగారెడ్డిజిల్లాలో 55371మంది స్వయం సహాయక నిరక్షరాస్యులను గుర్తించి అక్షరాస్యులను చేసేందుకు చర్యలు తీసుకున్నామని జిల్లా వయోజనవిద్యాశాఖ నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు దినేష్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్, స్వయం సహాయక అధ్యక్షులు విద్యలు పాల్గొన్నారు.

జహీరాబాద్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించండి

-మంత్రి దామోదర్ రాజనర్సింహాతో మున్సిపల్ చైర్మన్

కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్

జహీరాబాద్, మార్చి 12, ప్రభాతవార్త:
జహీరాబాద్ పట్టణ సమగ్ర అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ మహమ్మద్ యూనుస్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర్ రాజనర్సింహను కోరారు. గురువారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో నిర్వహించిన ప్రజా ప్రతినిధుల అవగాహన సదస్సుకు హాజరైన మంత్రిని చైర్మన్ నిధుల మంజూరు కోసం వినతిచేశారు. పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సరఫరాకు రహదారుల నిర్మాణానికి ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. చైర్మన్ వినతికి మంత్రి దామోదర్ రాజనర్సింహ సానుకూలంగా స్పందిస్తూ త్వరలోనే జహీరాబాద్‌లో ప్రత్యేక రివ్యూ సమావేశం నిర్వహించి నిధుల కేటాయింపుకు తనవంతు కృషిచేస్తానని మంత్రి చైర్మన్‌కు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మంత్రి సి.దామోదర్ రాజనర్సింహ, మున్సిపల్ చైర్మన్‌లతోపాటు మున్సిపల్ కౌన్సిలర్లు, పాల్గొన్నారు.

పదవతరగతి పరీక్షలకు విద్యార్థులు సిద్ధంకావాలి

-సిఐ జాన్‌రెడ్డి

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న నర్సాపూర్ సిఐ జాన్‌రెడ్డి

నర్సాపూర్, మార్చి 12, ప్రభాతవార్త:
ఈ నెల 14న జరగనున్న పదవ తరగతి పరీక్షలు రాసేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని నర్సాపూర్ సిఐ జాన్‌రెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని నలంద పాఠశాలలో, మండలపరిధిలోని కాగజ్‌మద్దూర్ గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో పదవతరగతి పరీక్షలురాసే విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి పరీక్షలురాయాలని సూచించారు. అదేవిధంగా డ్రగ్స్‌నిర్మూలన, రోడ్డుభద్రతల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఐ జాన్ రెడ్డి తో పాటు, ఎస్సై జగన్నాథం, పాఠశాల ఉపాధ్యాయులు,పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పర్యటించిన చైర్మన్, కౌన్సిలర్

గుమ్మడిదల, మార్చి 12, ప్రభాతవార్త:
గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని 18వ వార్డులో నెలకొన్న వివిధ సమస్యలను తెలుసుకోవడానికి మున్సిపల్ చైర్మన్ కుమార్‌గౌడ్, వార్డు కౌన్సిలర్ నర్సంపల్లి రాజిరెడ్డి, అభిశెట్టి రాజశేఖర్‌తో కలిసి గురువారం పర్యటించారు. ఈసందర్భంగా వార్డులోని సమస్యలు తదితర అంశాలను పరిశీలించారు. వార్డులోని పలుకాలనీల్లోతిరిగి స్థానికప్రజలతో మాట్లాడి వారిసమస్యలను నేరుగా తెలుసుకొని, సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత మున్సిపల్ అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మండలంలోనే ప్రథమస్థానం సాధించాలి

కౌడిపల్లి, మార్చి 12, ప్రభాతవార్త:
నేడు జరిగే టెన్త్ వార్షికపరీక్షల్లో రాయిలాపూర్ ఉన్నతపాఠశాల టెన్త్ విద్యార్థులు 10/10 జిబి మార్కులతో ఉత్తీర్ణత సాధించి, మండలంలోనే ప్రథమ స్థానంలో నిలవాలని రాయిలాపూర్ గ్రామ ఉపసర్పంచి తమ్మల సంతోష్ పేర్కొన్నారు. గురువారం రాయిలాపూర్ ఉన్నతపాఠశాలలో 10వతరగతి విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్లు, పెన్నులు, హాల్‌టికెట్ కవర్లు తదితరాలు రాయిలాపూర్ తమ్మల సంతోష్ సొంతఖర్చులతో విద్యార్థులకు పంపిణీచేశారు. దాత సంతోష్‌ను ప్రిన్సిపాల్ లవనీ జ్యోతి, ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీసర్పంచి సంజీవులు, దొంతుల దుర్గయ్య, నర్సింలు, సత్యనారాయణ, రాంరెడ్డి, శంకర్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి సలీం, ప్రవీన్, కుమార్, రాజు నందు, రవి, ఉపాధ్యాయులు కవిత, జగదీష్, అనిల్‌ప్రసాద్‌రెడ్డి, కృష్ణవేణి, లక్ష్మి, దీపిక, కృష్ణమూర్తి, పిఈటి కృష్ణాగౌడు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

కూలీ వాళ్ళమని చులకనగా చూస్తున్నారు..

కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ఫిర్యాదు చేస్తున్న విద్యార్థిని తల్లిదండ్రులు

మెదక్, మార్చి 12, ప్రభాతవార్త:
మెదక్‌పట్టణంలో టిజిఆర్‌ఎస్ పాఠశాలలో దారుణం చోటుచేసుకుంది. మనస్విని అనే విద్యార్థిని ఆపాఠశాలలో ఏడవతరగతి చదువుతుంది. విద్యార్థిని తల్లిదండ్రులు నల్లగా ఉన్నారని, జంగిల్ నుంచి పట్టుకొచ్చారు అని, లేబర్‌పని చేసేవాళ్ళు అని, ఇలాంటి తల్లిదండ్రుల పిల్లలకు టిసి ఇచ్చి పాఠశాల నుంచి పంపించేయాలని ప్రిన్సిపాల్ తారాసింగ్ అవమానకరవ్యాఖ్యలు చేశారు. దీంతో విద్యార్థిని, ఆమె తల్లిదండ్రులు ఎల్లం, జ్యోతి మెదక్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా విద్యార్థిని మనస్విని మాట్లాడుతూ ఫిబ్రవరి 20వ తేదీన కిడ్నీస్టోన్ సమస్యతో బాధపడుతున్నట్లు తెలిపింది. దీంతో పాఠశాల సిబ్బంది విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం అందించడంతో తల్లిదండ్రులు పాఠశాలకు చేరుకొని మెదక్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించి ఇంటికి తీసుకెళ్లారు. అనంతరం కిడ్నీస్టోన్‌నొప్పి తగ్గిన వారంరోజుల తర్వాత విద్యార్థిని తల్లిదండ్రులు పాఠశాలకు తీసు కెళ్లగా పాఠశాలలో పనిచేసే నర్సు ఆశాజ్యోతి, ఇతర సిబ్బంది విద్యార్థినిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని మనస్విని తెలిపింది. ఇంకా మూడు సంవత్సరాలు ఇంకా పాఠశాలలోనే చదవాలని, ఎలా చదువుతావో చూస్తామని భయపెడున్నారని విద్యార్థిని ఆవేదన వ్యక్తంచేసింది. అంతేకాకుండా అనారోగ్యానికి గురై వాంతులు చేసుకున్న సందర్భంలో కూడా తనపట్ల నర్సు ఆశాజ్యోతి దురుసుగా ప్రవర్తించారని విద్యార్థిని భోరున విలపించింది.

అలాగే తనతోపాటు చదువుకునే విద్యార్థుల ముందు పాఠశాలలో పనిచేసే నర్సు ఆశాజ్యోతి తన తల్లిదండ్రులను కూడా కించపరిచేలా అవమానకర వ్యాఖ్యలు చేసిందని తెలిపింది. తదనంతరం మార్చి ఆరవతేదీన విద్యార్థినిని, ఆమె తల్లిదండ్రులు పాఠశాలకు తీసుకెళ్లగా కిడ్నీస్టోన్ పూర్తిగా తగ్గిన తర్వాతనే పాఠశాలకు రావాలని ప్రిన్సిపల్ చెప్పడంతో ఇంటికి వెళ్లారు. ఇరవై రోజుల నుండి తను ఆరోగ్యంగా ఉన్నానని, పాఠశాలకు వెళ్తానని చెప్పినప్పటికీ తనను పాఠశాలకు రానివ్వడం లేదని విద్యార్థిని కన్నీరు మున్నీరయింది. తనకూతురిని పాఠశాలలో చేర్పించేలా చూడాలని కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు తమ గోడును మనస్విని, ఆమె తల్లిదండ్రులు ఎల్లం, జ్యోతి చెప్పుకున్నారు.